# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :154 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 22-08-2025 | పేజీలు:4 వెల: 2.00


## వ్యభిచారం గృహంపై దాడి.. ఇద్దరు వ్యక్తులు, ఓ మహిళ అరెస్ట్

హైదరాబాద్,కపీహెచ్‌బీ కాలనీలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు ఆకస్మికంగా దాడిచేసి ఇద్దరు వ్యక్తులు, ఓ మహిళను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేపీహెచ్‌బీ కాలనీ 2వ రోడ్డులోని ఓ గృహంలో వ్యభిచారం జరుగుతుందని విశ్వసనీయ సమాచారం అందడంతో బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆ ఇంటి ముందు ఓ వ్యక్తి అనుమానస్పదంగా కనిపించగా.. గది లోపలికి వెళ్లే సరికి ఓ మహిళ అర్ధనగ్నంగా ఉండగా షేక్ గౌస్ పాషా(29) మరోక వ్యక్తి ఉన్నాడు. ఈ వ్యభిచార గృహాన్ని వ్యక్తి నిర్వహిస్తున్న వ్యక్తి ఒడిశా రాష్ట్రానికి చెందిన మహేశ్వర్ పట్నాయక్ అలియాస్ ప్రియాంకదాస్ (29)గా గుర్తించారు. ఈ వ్యక్తి చిన్నప్పటి నుంచి మహిళగా మారేందుకు యత్నిస్తున్నాడు. ఒడిశాలో కొన్నాళ్లు గడిపిన మహేశ్వర్ పట్నాయక్.. డబ్బుల కోసం మగ వ్యక్తుల వద్దకు వెళ్లే అలవాటు ఉంది. 6 సంవత్సరాల క్రితం వైజాగ్‌లో ఓ వ్యక్తిని పెండ్లి చేసుకుని విడాకులు తీసుకున్నాడు. వంట నేర్చుకుని వంటమాస్టర్ అయ్యాడు.

## అభివృద్ధి,సంక్షేమమే.. కాంగ్రెస్ లక్ష్యం



ఖమ్మం: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి కారణం రాష్ట్ర ప్రజల ఫలితమే అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆయన ఇవాళ(గురువారం) తిరుమలాయపాలెం మండలంలో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధిని ఎక్కడ తగ్గనివ్వకుండా ప్రభుత్వం పని చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ.. ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే.. ప్రజా ప్రభుత్వమని పేర్కొన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నేతలు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నారని పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పుకొచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుభరోసా రూ.10 వేలు ఇస్తే.. తమ ప్రభుత్వం రూ.12 వేల చొప్పున 9 రోజుల్లో 9 వేల కోట్లు ఇచ్చిందని తెలిపారు. పేదలకు గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేక పోయందని, ఈ ప్రభుత్వం 7 లక్షల రేషన్ కార్డులు పంపిణీ చేసిందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి తీరుతామని పొంగులేటి స్పష్టం చేశారు. పేద విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు అనేక సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో కోళ్ల ఫారాల్లో, రైస్ మిల్లుల్లో హాస్టల్స్ నిర్వహిస్తే.. ఈ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. రైతును రాజు చేసే పనిలో.. కాంగ్రెస్ ప్రభుత్వం ముందుటుందని వివరించారు. ధరణిని ఎత్తివేసి, భూభారత్ చట్టాన్ని తీసుకువచ్చి రైతులకు మేలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం చేసే ప్రతి మంచి కార్యక్రమానికి ప్రజలే అండగా ఉన్నారని పొంగులేటి హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో యూరియా కొరతక ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమని పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. కేంద్రం తెలంగాణను నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. యూరియాను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షలు రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి గత కొన్ని నెలలుగా కేంద్రాన్ని విజ్ఞప్తి చేస్తున్న పట్టించుకోవడం లేదని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వాన్ని బీజేపీ బద్నాం చేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ బీజేపీ నేతలు రాష్ట్రంలో రైతులు కష్టాలు పడుతుంటే.. చూస్తున్నారు తప్ప ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. త్వరలోనే రైతులకు యూరియాను సరఫరా చేస్తామని పొంగులేటి స్పష్టం చేశారు.

## ఉపరాష్ట్రపతి పదవికి జస్టిస్ సదర్శన్ రెడ్డి నామినేషన్

న్యూఢిల్లీ,ఆగస్ట్21: విపక్ష ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్‌కు చివరి తేదీ కావడంతో కాంగ్రెస్ అగ్రనేతల సమక్షంలో తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. నామినేషన్ కార్యక్రమానికి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురు ఇండియా కూటమి నేతలు హాజరయ్యారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి నామినేషన్‌ను బలపరుస్తూ సోనియా సహా 20 మంది ఎంపీలు సంతకాలు చేశారు. మరోవైపు అధికార ఎన్డీఏ కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ బుధవారం నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోదీ పలువురు కేంద్ర మంత్రుల సమక్షంలో ఆయన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ ఏర్పడిన ఉపరాష్ట్రపతి పదవికి సెప్టెంబర్ 9న ఎన్నిక జరగనుంది. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ– ఉంది. ఈ నేపథ్యంలో రాధాకృష్ణన్ విజయం లాంఛన ప్రాయమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సంఖ్యా బలం దృష్ట్యా చూస్తే ఆయన ఎన్నిక ఏకపక్షంగా జరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఉప రాష్ట్రపతి ఎన్నికలో తమ ఉమ్మడి అభ్యర్థిగా జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి పేరును విపక్ష ఇండియా కూటమి ప్రకటించడంతో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏలో ముఖ్యంగా దక్షిణాది భాగస్వామ్య పక్షాలలో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తిని, దేశంలోని ప్రముఖ న్యాయకోవిదుడిని తమ ఉమ్మడి అభ్యర్థిగా ఇండియా కూటమి ప్రకటించి తాము ఈ ఎన్నికల్లో లాంఛనంగా పోటీ చేయడం లేదన్న సందేశాన్ని ఎన్‌డీఏకి బలంగా పంపించాయి. లోక్‌సభ, రాజ్యసభలో అధికార ఎన్‌డీఏ కూటమికి అనుకూలంగా సంఖ్యాబలం స్పష్టంగా కనపడుతున్నప్పటికీ వ్యూహాత్మకంగా తాము ఎంపిక చేసిన అభ్యర్థితో కొన్ని రాజకీయ పార్టీలు పునరాలోచనలో పడే అవకాశం లేకపోలేదని ఇండియా కూటమి అంచనా వేస్తోంది. ఇది సైద్ధాంతక సమరమని డీఎంకే ఎంపీ కనిమొళి అభివర్ణించారు. ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న వ్యక్తికి వ్యతిరేకంగా రాజ్యాంగాన్ని గౌరవించే అభ్యర్థిని తాము ఉమ్మడిగా ఎంపికచేశామని ఆమె పేర్కొన్నారు. అయితే తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి రెండుసార్లు ఎంపీగా పనిచేసిన



సీపీ రాధాకృష్ణన్‌ని తమ అభ్యర్థిగా ఎన్‌డీఏ నామినేట్ చేసి ఎంకే స్టాలిన్ నాయకత్వంలోని డీఎంకేలో గందరగోళాన్ని సృష్టించేందుకు ప్రయత్నించింది. తమిళనాడులో తమిళుల ఆత్మగౌరవం అన్నది చాలా భావోద్వేగాలతో ముడిపడిన అంశం కావడంతో స్థానిక సెంటిమెంటుకు, జాతీయ రాజకీయ లెక్కలకు మధ్య గీత గీయాల్సిన పరిస్థితి డీఎంకేకి ఏర్పడింది. విపక్షాల ఉమ్మడి అభ్యర్థికే తమ మద్దతని ప్రకటించిన డీఎంకే తమ నిర్ణయాన్ని రాజకీయంగా నిర్వచించాలే తప్ప భాషాపరంగా లేక ప్రాంతీయ ఆత్మగౌరవంతోనో చూడకూడని పేర్కొంది. నలుగురు రాజ్యసభ సభ్యులున్న భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) ఉప రాష్ట్రపతి అభ్యర్థిపై తన వైఖరిని ఇంకా నిర్ణయించలేదు. ఈ ఎన్నికలో ఎవరికి మద్దతు ఇవ్వాలన్న అంశంపై పార్టీ అధ్యక్షుడు కే చంద్రశేఖర్ రావు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఇక వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్ఆర్‌సీపీ తాను ఎన్‌డీఏ అభ్యర్థికే మద్దతు ఇస్తున్నట్లు– ప్రకటించింది. తమ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలన్న ఇండియా కూటమి అభ్యర్థనను ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తిరస్కరించారు. తాము ఎన్‌డీఏ అభ్యర్థికే మద్దతు ఇవ్వనున్నట్లు– తెలిపారు. రాజ్‌నాథ్ సింగ్ తమను సంప్రదించారని, ఎన్‌డీఏ అభ్యర్థికి మద్దతు ఇస్తామని ఆయనకు మాట ఇచ్చామని సుబ్బారెడ్డి చెప్పారు. ఒడిశాకు చెందిన బిజూ జనతా దళ్(బీజేడీ) ఉప రాష్ట్రపతి ఎన్నికలలో తమ వైఖరిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు.మద్దతు కోసం నవీన్ పట్నాయక్ పార్టీని ఇండియా కూటమి నాయకులు ఇప్పటివరకు సంప్రదించలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## ఈ బిల్లు మీకే కాదు.. అన్ని పార్టీలకు వర్తిస్తది..

ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం కీలక రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర లేదా రాష్ట్ర మంత్రులు సహా పదవిలో ఉన్న ఏ రాజకీయ పార్టీ నేత అయిన సరే.. తీవ్రమైన నేరాల్లో అరెస్ట్ అయి 30 రోజులు జైల్లో ఉంటే పదవి కోల్పోయేలా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బుధవారం లోక్‌సభలో మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టారు. ఈ బిల్లుల ప్రకారం, ఐదేళ్లకుపైగా శిక్షకు దారి తీసే నేరాలపై అరెస్టై వరుసగా 30 రోజులు జైలులో ఉంటే.. 31వ రోజున ఆయా పదవి నుంచి ఎవరైనా స్వయంగా తప్పుకోవాల్సిందే. రాజీనామా చేయకపోయినప్పటికీ అటువంటి నాయకులు పదవీచ్యుతులవుతారు. ఈ బిల్లుపై కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష ఇండియా తీవ్ర నిరసన వ్యక్తం చేయడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు.

కాంగ్రెస్‌కోసం కాదు.. అందరికీ వర్తిస్తుంది..

ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, 'రాజకీయాలతో సంబంధం లేని బిల్లు ఇది. కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లుకు ఎందుకు భయపడుతోంది. గుమ్మడి కాయల దొంగ అంటే భుజాలు తడుముకొన్నట్లు కాంగ్రెస్ పరిస్థితి ఉంది. కోర్టు తీర్పు తర్వాతే అమిత్ షా ఎన్నికల్లో పోటీ చేశారు. అద్వానీ పై ఆరోపణలు వస్తే రాజీనామా చేసి తర్వాత ఎన్నికల్లో పోటీ చేశారు. నైతిక విలువలు కట్టుబడి నాడు అమిత్ షా రాజీనామా చేశారు. ఆరోపణలు వచ్చినప్పుడు స్వచ్ఛందంగా పదవి నుంచి తొలగి పోవాలి. అరవింద్ కేజ్రీవాల్ జైల్లో రివ్యూమీటింగ్ పెట్టాడు. ఆరు నెలలు జైలు నుంచే సీఎంగా పరిపాలన చేసి వ్యవస్థల పరువు తీశాడు. జైలు కు వెళ్లి కూడా తమిళ నాడు మంత్రి సెంథిల్ బాలాజీ పదవిలో కొనసాగాడు. ఈ బిల్లుపై చర్చ జరపాలని జేపీసీకి పంపాం. దీనిపై మేధావులు,విద్యావంతులు ప్రజలు చర్చించాలి. నైతిక విలువల రాజకీయాల కోసమే ఈ బిల్లు తీసుకువచ్చాం' అని స్పష్టం చేశారు.

గురివింద రాజకీయాలు చేసేవారే వ్యతిరేకిస్తున్నారు..

లోక్ సభలో ఈ బిల్లు విషయంలో కాంగ్రెస్ కూటమి తీరు దుర్మార్గమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. గురివింద రాజకీయాలు చేసే పార్టీలే ఈ బిల్లుని వ్యతిరేకిస్తున్నాయి. నిజాయితీ పాలన చేస్తే ఎవరూ జైలుకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. అవినీతి అధికారులకు ఏవిధమైన శిక్ష ఉంటుందో అవినీతి రాజకీయ నాయకులకు శిక్ష తప్పదు. రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగుతున్నారు. ఎప్పుడూ ఎన్నికలు జరిగినా మూడు రాష్ట్రాల్లో ఉన్న కాంగ్రెస్ ఓటమి ఖాయం. ఎన్నికలు వస్తే మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ భయంకరంగా



ఓడిపోతుందని ఆయన జోస్యం చెప్పారు. అలాగే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో కేటీఆర్ మద్దతు ఎవరు అడిగారని ఈ సందర్భంగా అన్నారు.ఆర్టికల్ 75 (ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల నియామకం), ఆర్టికల్ 164 (సీఎంలు, రాష్ట్ర మంత్రుల నియామకం)లతో అనుసంధానిస్తూ 130వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా లోక్ సభలో ప్రతిపాదించారు. అంతేకాదు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జమ్మూ కశ్మీర్‌కు కూడా ఈ నియమాలు వర్తించేలా యూనియన్ టెరిటరీస్ (సవరణ) బిల్లు–2025, జమ్మూ అండ్ కాశ్మీర్ రీ ఆర్గనైజేషన్ (సవరణ) బిల్లు – 2025లను కూడా ప్రవేశపెట్టారు.

యూరియాపై క్లారిటీ..

ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం ప్రభుత్వం నుంచి రావాల్సిన యూరియాపైనా కేంద్రమంత్రి స్పందించారు. తెలంగాణ మంత్రులు ప్రతిరోజూ యూరియా లేదు అంటూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. యూరియాను కొందరు నిల్వ చేసుకుంటున్నారు. పెద్దఎతున్న యూరియాను ఇతర వాటికి తరలిస్తున్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అడిగినా.. అడగకపోయినా.. యూరియా ఇస్తాము. పెద్దరైతులు యూరియాను నిల్వచేయకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది. కేంద్ర ప్రభుత్వం దాదాపు 2300 సబ్సిడీతో రైతులకు యూరియా ఇస్తోంది. క్రిపోకో నుంచి 17,500 మెట్రిక్ టన్నుల యూరియా తెలంగాణకు వస్తుంది. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా తెలంగాణకు రాబోతుంది. చైనా,ఉక్రెయిన్ నుంచి రావాల్సింది కొంత ఆలస్యం అయింది. తమిళనాడు పోర్ట్ నుంచి 10 వేల మెట్రిక్ టన్నుల యూరియా తెలంగాణకు రానున్నదని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల కోసం రైతులను ఇబ్బంది పెడుతున్నది



నల్లగొండ : నెల రోజులుగా యూరియా కొరత తీవ్రంగా వేదిస్తుంది. ఇది ఇంకా తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. రైతులు నిద్రాహారాలు మాని చెప్పులు పెట్టుకుని అవస్థలు పడుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. నల్లగొండలోని బీఆరెస్ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎకరానికి రూ.20 వేల పెట్టుబడి పెడితే ఒక్క బస్తా యూరియా మీద దిగుబడి ఆధార పడి ఉంది. కానీ ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదని మండిపడ్డారు.కెసిఆర్ వేసవిలోనే గోదాముల్లో ఎరువులు నిల్వ చేసి పెట్టేవారు. వ్యవసాయ రంగం పై రెగ్యులర్ రివ్యూ చేస్తూ రైతుల ఇబ్బందులు పడకుండ జాగ్రత్త పడేవాళ్లమని గుర్తు చేశారు. కనీసం సీజన్‌లో నాలుగు సార్లు రివ్యూ జరిగేది రైతులు విత్తనాల కోసం, ఎరువుల కోసం ఇబ్బందులు పడడం దారుణం. గతంలో ధాన్యం కొనుగోళ్లకు రైతులు ఇబ్బంది పడ్డారు. కరెంట్ కోసం ఇబ్బందులు మొదలయ్యాయి. యూరియా కొరత వెనక కొంతమంది మంత్రులు, అధికారులు ఉన్నారని ఆరోపించారు. కమీషన్ల కోసం రైతులను ఇబ్బంది పెడుతున్నారు.

రైతులను కాళ్లు పట్టుకునే దుస్థితికి తెచ్చారు

ఎరువులను బ్లాక్ మార్కెట్ చేసేందుకు కమీషన్లు తీసుకుంటున్నారని విమర్శించారు. గతంలో నల్లగొండ మంత్రి ధాన్యం కొనుగోళ్లలోను కమీషన్లు తీసుకుని రైతులను గాలికి వదిలేసారు. గతంలో మేము వస్తే అన్ని తెస్తామన్నారు. ఢిల్లీకి 56 సార్లు వెళ్లిన సీఎం కనీసం ఎరువులు తేలేవా? అని ప్రశ్నించారు. పోలీసులతో పహారా, లాఠీఛార్జ్ లతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. ఢిల్లీకి వెళ్లి కాళ్లు పట్టుకుని పదవులు తెచ్చుకునే కాంగ్రెస్ నేతలకు..రైతులను కాళ్లు పట్టుకునే దుస్థితికి తెచ్చారని ధ్వజమెత్తారు. నల్లగొండ నియోజకవర్గంలో మంత్రి పూర్తిగా విఫలం అయ్యారన్నారు.

మంత్రులు సిగ్గు పడాలి

ఇద్దరూ మంత్రులు ఉండి కూడా జిల్లాపై కనీసం రివ్యూ చేయలేదన్నారు. మంత్రుల తీరుతో నల్లగొండ జిల్లా ప్రతి రంగంలో తిరోగమానంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ నియోజకవర్గంలో సాగు నీళ్ల కోసం రైతులు రోడ్డు ఎక్కుతుంటే మంత్రులు సిగ్గు పడాలన్నారు. మంత్రికి చేత కాక అధికారులతో తప్పుడు పద్ధతుల్లో ప్రకటనలు చేయిస్తున్నారు.కొరత లేదని తప్పుడు ప్రకటనలు చేసే అధికారులు తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు.మంత్రుల బాధ్యతను మీరు నెత్తిన వేసుకుని ఇబ్బందులు పడొద్దని సూచించారు. అధికారుల ప్రకటన నిజం అయితే రైతులు ఇవ్వాళ కూడా ఎందుకు క్యూ లైన్ల లో ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా రైతులు ప్రభుత్వం మెడలు వంచేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే లు గాదారి కిశోర్ కుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు సాధారణం..



హైదరాబాద్,వరంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్ ముంపునకు గురవుతుండడానికి నాలాల ఆక్రమణే కారణమని గుర్తించినట్లు పేర్కొన్నారు. వాటికి సంబంధించి DPR సిద్ధం చేస్తున్నట్లు, వరంగల్‌ను ముంపు ప్రాంతాలు లేని నగరంగా మార్చుతామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు సర్వసాధాణమని పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సాధారణ వర్గ విభేదాలను ప్రతిపక్షలు తప్పుడు కోణంలో చూస్తూ.. తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఏ పార్టీలో అయిన వర్గ విభేదాలు ఉంటాయని, సమయాన్ని బట్టి అవి బయటకు వస్తాయని పేర్కొన్నారు.వరంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్ ముంపునకు గురవుతుండడానికి నాలాల ఆక్రమణే కారణమని గుర్తించి నట్లు పేర్కొన్నారు. వాటికి సంబంధించి DPR సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. వరంగల్‌ను ముంపు ప్రాంతాలు లేని నగరంగా మార్చుతామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటు చోరీ ఉద్యమానికి భారీ స్పందన వస్తోందని తెలిపారు. దొంగ ఓట్లతోనే అన్ని రాష్ట్రాల్లో బీజేపీ గెలుస్తోందని ఆరోపించారు. ప్రధాని మోదీకి మొదటి నుంచి తెలంగాణ అంటే ఇష్టం లేదని.. అందుకోసమే రాష్ట్రానికి యూరియా ఇవ్వడం లేదని మండిపడ్డారు. యూరియా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని చెప్పుకొచ్చారు.కాళేశ్వరం నివేదికతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమాలు బట్టబయలయ్యాయని మంత్రి సురేఖ విమర్శించారు. నివేదికలో మాజీ సీఎం కేసీఆరే.. ప్రధాన సూత్రధారిగా తేలిందని ఆరోపించారు. నివేదికలో నిజాలు బయటపడ్డ బీఆర్ఎస్ నేతలు ప్రజలకు కళ్ళబుల్లి మాటలు చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.బీఆర్ఎస్, బీజేపీలు రాష్ట్ర ప్రజలకు విష ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు.బీజేపీ నుంచి 8 మంది ఎంపీలు ఉన్న కేంద్రం నుంచి యూరియా తేలేకపోయారని విమర్శించారు. తెలంగాణలో మోదీ భజన చేయడంలో ఉన్న శ్రద్ధ వారికి రైతుల మీద లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీపై ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు తమ వైపే ఉన్నారని కొండా సురేఖ స్పష్టం చేశారు.

## కేటీఆర్ కీలక నిర్ణయం.. కవిత లేఖాస్త్రం

హైదరాబాద్, ఆగస్టు 21: బీఆర్ఎస్ పార్టీలో అధిపత్యం కోసం జరుగుతున్న అంతర్గత పోరు తారా స్థాయికి చేరుకొంది. ఇంకా చెప్పాలంటే.. బీఆర్ఎస్ పార్టీ అధినేత కుమారుడు కేటీఆర్‌కు కుమార్తె కల్వకుంట్ల కవిత మధ్య పరిస్థితి ఉప్పు నిప్పుగా మారింది. అలాంటి వేళ.. కవిత ఎపిసోడ్‌పై బీఆర్ఎస్ పార్టీలో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. తాజాగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలు కవితను ఆమె పదవి నుంచి సోదరుడు కేటీఆర్ తొలగించారు. కవిత స్థానంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను నియమించారు. ఈ నేపథ్యంలో ఆమెరికా పర్యటనలో ఉన్న కల్వకుంట్ల కవిత స్పందించారు.ఆ క్రమంలో సింగరేణి కార్మికులకు కవిత గురువారం ఒక బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖలో తన సోదరుడు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, తన సోదరుడు కేటీఆర్ లక్ష్యంగా కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీలో తాజాగా ఇటీవల చోటుచేసున్న పరిణామాలపై కె. కవిత తీవ్ర ఆందోళన చెందారు. బీఆర్ఎస్ పార్టీలో తనపై కుట్ర జరుగుతోందని కవిత మరోసారి ఆరోపించారు.తాను ప్రశ్నించినందునే పార్టీలో తనపై కొందరు కక్ష కట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ హితం కోరి తాను మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు లేఖ రాశానని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో పార్టీలోని నేతలు తన పట్ల కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి కేసీఆర్‌కు తాను రాసిన లేఖ తర్వాత తనను వేధింపులకు గురిచేస్తున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తాను అమెరికా పర్యటనలో ఉండగా.. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా తనను టీబీజీకేఎస్ నుంచి



తొలగించారని ఆ లేఖలో ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు.

విదేశీ పర్యటనలో కవిత..

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు , ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నారు. ఆమె చిన్న కుమారుడు ఆర్యకు అమెరికా యూనివర్సిటీలో సీట్ వచ్చింది. దీంతో అతడిని యూనివర్సిటీలో జాయిన్ చేసేందు ఆర్యతో కలిసి ఆమె అమెరికాకు వెళ్లారు. ఈ పర్యటనకు వెళ్లే ముందు బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను తన కుటుంబంతో కలిసి కవిత కలిశారు. ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో తండ్రి కేసీఆర్ నుంచి కల్వకుంట్ల కవిత కుటుంబం ఆశీర్వాదం తీసుకుంది. ఆ వెంటనే కవిత కుటుంబం హైదరాబాద్‌కు చేరుకుంది. ఆ మరునాడే తన కుమారుడితో కలిసి.. కవిత అమెరికాకు పయనమైయ్యారు.

## సంపాదకీయం

శుక్రవారం 22-08-2025

# కాంతిని గడ్డ కట్టించారు

సెకనుకు మూడు లక్షల కిలోమీటర్ల వేగంతో పరుగు తీసే కాంతిని శాస్త్రవేత్తలు 'సూపర్‌సాలిడ్' అనే ప్రత్యేక స్థితిలో నిలిపారు. ఒకే సమయంలో ఘన పదార్థంలా క్రమబద్ధంగా ఉండగలగడం, ద్రవంలా స్వేచ్ఛగా ప్రవహించగలగడం ఈ అద్భుత స్థితి లక్షణాలు! ఇది కేవలం శాస్త్ర ప్రయోగం కాదు– రేపటి సాంకేతిక విప్లవానికి తొలి అడుగు!మన చుట్టూ నిరంతరం వెలుతురు ప్రవహిస్తూ ఉంటుంది– చీకటిని తరిమి కొడుతుంటుంది. విశ్వంలో స్వేచ్ఛగా తిరిగే శక్తి... కాంతి మాత్రమే. ఆ కాంతిని చూడగలం, తాకలేం. మన చేతుల్లోకి తీసుకోలేం. అలాంటిదాన్ని ఒక్కచోట నిలపడం, గడ్డకట్టించడం... గతంలో అయితే సైన్స్ ఫిక్షన్ కథలకే పరిమితం. ఇప్పుడది నిజమైంది! ఇటలీకి చెందిన 'నేషనల్ రీసెర్చ్ కౌన్సిల్' భౌతిక శాస్త్రవేత్తల బృందం, కాంతిని 'సూపర్‌సాలిడ్' అనే ప్రత్యేక పదార్థస్థితిలోకి మార్చినట్లు ఇటీవల ప్రకటించింది. ఇదొక అద్భుతమైన పరిణామం. ఎందుకంటే ఇది కాంతిని ఒకే సమయంలో ఘన, ద్రవ పదార్థాల్లా ప్రవర్తించే విచిత్రమైన స్థితిలోకి మార్చే ప్రక్రియ. 'కాంతిని గడ్డకట్టించగలమా?' అనే ప్రశ్నకు సమాధానం!రెండు విరుద్ధ లక్షణాలైన ఘన, ద్రవత్వాలను కలిగి ఉండే ప్రత్యేక పదార్థస్థితిని 'సూపర్‌సాలిడ్' అంటారు. ఒకవైపు ఇది స్ఫటికంలాంటి అణు నిర్మాణాన్ని కలిగి ఉంటుందిటీ మరోవైపు సూపర్‌ఫ్లూయిడ్‌లా ఘర్షణ లేకుండా నిరంతరంగా ప్రవహించగలదు. ఈ చరిత్రాత్మక విజయాన్ని సాధించేందుకు శాస్త్రవేత్తలు గాలియం ఆర్సనైడ్ అనే సెమీకండక్టర్ పదార్థంపై లేజర్ కాంతిని ప్రసరింపజేశారు. ఈ ప్రక్రియలో కాంతి కణాలు (ఫోటాన్‌లు) పదార్థాలను ఏర్పరిచే ద్రవ్యరాశి కలిగిన మూలకణాలైన ఎలక్ట్రాన్లతో అనుసంధానమై 'పోలారిటాన్‌లు' అనే హైబ్రిడ్ కణాలను ఏర్పరిచాయి. సాధారణంగా కాంతి నిలవదు, బరువూ ఉండదుటీ కానీ పదార్థానికి నిర్మాణం ఉంటుంది. శాస్త్రవేత్తలు ఈ రెండింటి లక్షణాలను కలిపి, ఫోటాన్‌లకు కొంత 'భౌతికత'ను ఇస్తూ, ఒక క్రమబద్ధ నిర్మాణంలో అమరేలా చేయగలిగారు. ఇది కాంతిని నిలిపేయడమే కాదు, దాని ప్రవాహ గుణాన్ని కూడా కోల్పోకుండా నిలబెట్టి, క్రమబద్ధ నిర్మాణాన్ని కలిగిన ఘన పదార్థంలా ప్రవర్తించేలా చేసిన ఘట్టం. ఒక నమూనాలో ఒదిగినప్పటికీ ఫోటాన్‌లు స్వేచ్ఛగా కదలగలగడం విశేషం.

పునాది... మన బోస్

భౌతికశాస్త్రంలో అత్యంత ప్రభావశీలమైన సిద్ధాంతాలలో ఒకటైన 'బోస్–ఐన్‌స్టీన్ కండెన్సేషన్'కు ప్రయోగాత్మక రూపమే– ఈ సూపర్‌సాలిడ్ కాంతి. ఈ భావనకు పునాది వేసింది భారతీయ శాస్త్రవేత్త సత్యేంద్రనాథ్ బోస్. ఆయన 1920లలో కాంతి కణాలైన ఫోటాన్‌ల ప్రవర్తనపై చేసిన గణిత విశ్లేషణలు ఐన్‌స్టీన్‌ను ఆకట్టుకున్నాయి. ఫలితమే 'బోస్–ఐన్‌స్టీన్ కండెన్సేషన్' సిద్ధాంతం. దీని ప్రకారం– కొన్నిరకాల కణాలు (ఫోటాన్‌లు) అతి తక్కువ ఉష్ణోగ్రతల దగ్గర (మైనస్ 273 డిగ్రీల సెంటీగ్రేడు) ఒకే క్వాంటం స్థితిలో విలీనమై ఒకేలా ప్రవర్తిస్తాయి. కానీ, పదార్థాల తయారీకి కీలకమైన ఎలక్ట్రాన్లకు ఈ సిద్ధాంతం వర్తించదు. అన్ని ఎలక్ట్రాన్లు ఒకే క్వాంటం స్థితిని పొందలేవు. కానీ, జంటగా ఏర్పడి సూపర్ కండక్టివిటీకి సహకరించగలవు. గతంలో సూపర్‌సాలిడిటీ అనే ప్రత్యేక పదార్థ స్థితిని ఈ బోస్–ఐన్‌స్టీన్ కండెన్సేట్ల రూపంలోనే చూశాం. ఇదే సూత్రాన్ని ఆధారంగా తీసుకుని శాస్త్రవేత్తలు ఇప్పుడు సూపర్‌సాలిడ్ కాంతిని సృష్టించారు. దీనికోసం వారు ఉపయోగించినవి 'పోలారిటాన్‌లు' అనే హైబ్రిడ్ కణాలు. వీటికీ బోస్–ఐన్‌స్టీన్ కండెన్సేషన్‌కు లోబడి ఒకే క్వాంటం స్థితిలోకి వెళ్లే సామర్థ్యం ఉంది. ఈ పోలారిటాన్‌లు పరస్పరం ఆకర్షించుకుంటూ, సరిగ్గా బోస్–ఐన్‌స్టీన్ కండెన్సేట్‌లా సమరూపంగా ప్రవర్తించాయి. అవి తక్కువ ఉష్ణోగ్రతల్లో కాక సెమీకండక్టర్ వాతావరణంలో ఉత్పత్తయినప్పటికీ, ఘన పదార్థంలా క్రమబద్ధమైన స్ఫటిక నిర్మాణాన్ని ఏర్పరచాయి. అదే సమయంలో ప్రవహించే స్వేచ్ఛను కోల్పోకుండా సూపర్‌ఫ్లూయిడ్‌లా ప్రవర్తించాయి. కాంతి–పదార్థ మిశ్రమ కణాలైన పోలారిటాన్‌లు తక్కువ జీవితకాలం కలిగిన, ప్రవాహ స్థితిలోనే పోయే కణాలు. వీటిని బోస్–ఐన్‌స్టీన్ కండెన్సేషన్ స్థితిలోకి తీసుకురావాలంటే, నానోస్థాయిలో నిర్మించిన నాణ్యమైన మైక్రో కేవిటీలు, సెమీకండక్టర్ పదార్థాలు, అతి తక్కువ ఉష్ణోగ్రతలు, కచ్చితమైన లేజర్ నియంత్రణ– ఇలా అనేక అంశాల్లో అసాధారణ నైపుణ్యం అవసరం. అంతేకాక, ఈ స్థితి ఏర్పడిందని నిర్ధారించడానికి అత్యంత సున్నితమైన స్పెక్ట్రోస్కోపి, ఇంటర్‌ఫెరోమీట్రీ, ద్రవ్యవేగం–స్పేస్ మ్యాపింగ్ వంటి అత్యాధునిక పద్ధతులు అవసరమయ్యాయి. అందుకే ఈ ప్రయోగం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలందుకుంది.

ఏమిటీ ఉపయోగాలు?

ఈ సూపర్‌సాలిడ్ కాంతి ప్రయోగానికి భవిష్యత్తులో విప్లవాత్మక మార్పులను సృష్టించగలిగిన సత్తా ఉంది. భౌతిక శాస్త్ర పరిధులను విస్తరించే ఈ ప్రయోగం అనేక హైటెక్ రంగాల్లో వినూత్న అన్వయాలను చూపగలదు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో అనూహ్య పురోగతి సాధ్యమవుతుంది. సూపర్‌సాలిడ్ దశలోని ఫోటాన్‌లు ఒకే క్వాంటం స్థితిలో ఉండటం వల్ల, తక్కువ శక్తినష్టంతో వేగవంతమైన సమాచార నిర్వహణకు ఇది దోహదం చేస్తుంది. దీనివల్ల, భవిష్యత్తులో మరింత స్థిరత్వం గల, తక్కువ శక్తితోనే వేగంగా పనిచేసే క్వాంటం కంప్యూటర్‌లు రూపుదిద్దుకోగలవు. కాంతిని నియంత్రించగలిగిన సామర్థ్యం వల్ల ఫోటోనిక్ పరికరాల రూపకల్పన కొత్తపుంతలు తొక్కగలదు. సూపర్‌సాలిడ్ కాంతి ఆధారంగా తయారయ్యే సర్క్యూట్లు, సంప్రదాయ ఎలక్ట్రానిక్ సర్క్యూట్లకన్నా వేగంగా, అధిక స్థాయిలో డేటా నిర్వహణకు వీలు కల్పించగలవు. ఇంకా, ఈ ప్రయోగం ఆధారంగా కమ్యూనికేషన్ వ్యవస్థల్లోనూ కొత్త మార్గాలు తెరుచుకుంటాయి. డేటా నష్టం లేకుండా వేగంగా సంకేతాలను ప్రసారం చేయగల సాంకేతికత అభివృద్ధి చెందుతుంది. ఇది అంతరిక్ష, సముద్ర గర్భంలో కమ్యూనికేషన్ వంటి సవాళ్లతో కూడిన విభాగాల్లో ఉపయోగపడు తుంది. ఈ కాంతి తరంగాలను వినియోగించి, పరిసరాలను సునిశితంగా గుర్తించగల సెన్సింగ్ పరికరాలను తయారుచేయవచ్చు. ఇవి బయోమెడికల్, భద్రతా వ్యవస్థలు, శాస్త్రీయ పరిశోధనల్లో కీలకం కావచ్చు. ఈ సూపర్‌సాలిడ్ కాంతి ఆధారంగా తయారయ్యే ప్రత్యేక పదార్థాలు– హోలోగ్రాఫిక్ డిస్‌ప్లేలు, ఎన్‌క్రిప్టెడ్ లైటింగ్ వ్యవస్థలు వంటి నూతన సాంకేతికతలకు కూడా బీజం వేయగలవు. ఇప్పుడిదొక శాస్త్ర ప్రయోగంగా కనిపించినా, రేపటి ప్రపంచాన్ని మలచే శక్తిగా మారగలదన్న నమ్మకం ఉంది.

# జీహెచ్ఎంసీలో తిష్ట వేసిన 'డిప్యూటేషన్'

హైదరాబాద్,ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హైదరాబాద్ నగరంపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టారు. పట్టణాభివృద్ధిపై అనుభవం ఉన్న సీనియర్ ఐఏఎస్ పీకే మహంతి ని ఎంసీహెచ్ (మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్) కమిషనర్ గా నియమించారు. కమిషనర్ సమర్థవంతంగా విధులు నిర్వర్తించడంతో పాటు ఆయన ఆదేశాలను అమలుపరి చేందుకు సీనియర్ ఐఏఎస్ లను అర డజన్ మంది వరకు నియమించారు. పాతిక సంవత్సరాల క్రితమే కమిషనర్ తో సహా ఏడుగురు ఐఏఎస్‌లు పనిచేశారంటే, ప్రస్తుత జీహెచ్ఎంసీలో కనీసం డజన్ మంది సీనియర్ ఐఏఎస్ లు పనిచేయాల్సిన అవసరం ఉంది. కార్పొరేషన్ స్థాయి పెరిగిన తరువాత సీనియర్లను నియమించాల్సి ఉండగా తాము ఇచ్చే ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేసే డూ డూ బసవన్నల మాదిరి ఐఏఎస్ లను జీహెచ్ఎంసీకి అధిపతులు నియమిస్తున్నారు. పట్టణాభివృద్ధి పై ఏమాత్రం అవగాహన లేని వారే కమిషనర్లుగా నియమితులవుతున్నారు. వీరి రాక మూలంగా నగరం మరింత అధ్వాన్నంగా తయారవుతూ, ప్రజల జీవన ప్రమాణాలు దిగజార్చేలా చర్యలుంటున్నాయి.

పరిధి పెరిగింది.. కమిషనర్ స్థాయి పెరగలేదు

ఎంసీహెచ్ గా ఉన్న సమయంలో పీకే మహంతి ముఖ్య కార్యదర్శి గా పనిచేశారు. ఆయనకు పట్టణాభివృద్ధి, వనరుల సమీకరణ, పౌరులకు మెరుగైన పాలన అందించడంలో జాతీయ స్థాయిలోనే విశేషమైన అనుభవంతో పాటు పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఆయన కింద ప్రధాన కార్యాలయంలో ప్లానింగ్, శానిటేషన్, ప్రాజెక్టులు, ఫైనాన్స్, యూసీడీ విభాగాలకు అడిషనల్ కమిషనర్లుగా సీనియర్ ఐఏఎస్ లు ఉన్నారు. వీరితో పాటు సికింద్రాబాద్ జోన్ అడిషనల్ కమిషనర్ గా జిల్లా కలెక్టర్ స్థాయి అధికారులే పనిచేశారు. కమిషనర్ నాయకత్వంలో అందరూ ఒక టీమ్ లా ఏర్పడి నగరం రూపు రేఖలు మార్చారు. ఆ సమయంలో తెల్లారే సరికల్లా నగర రోడ్లు, వీధుల వెంట చెత్త కుప్పలు కనిపించేవి కావు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా రోడ్లను భారీగా విస్తరించారు. చిన్నపాటి కుంటలు కబ్జా కాకుండా నిరోధించేందుకు పార్కులుగా మార్చి, ఆ ప్రాంతంలో భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టారు. నగరంలో సమస్యల పరిష్కారం కోసం హైలెవల్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ కి ఎంసీహెచ్ కమిషనర్ కన్వీనర్ కాగా మెట్రో వాటర్ సప్లయి బోర్డు ఎండీ, హుడా వైస్ ఛైర్మన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, నగర పోలీసు కమిషనర్, ట్రాఫిక్ డీసీపీ, విద్యుత్ మెట్రో జోన్ సీఈ, బీఎస్ఎన్ఎల్ పీజీఎం లు సభ్యులుగా ఉండేవారు. ప్రతి సోమవారం ఈ కమిటీ నగరంలో ఒక ప్రాంతంలో పర్యటించి, సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించేది. ఈ కమిటీ పర్యటన మూలంగా నగరంలో చాలా వరకు సమస్యలు పరిష్కారం అయ్యాయి.ఎంసీహెచ్ కి.. జీహెచ్ఎంసీగా స్థాయి పెరిగినా కమిషనర్ స్థాయి మరింత దిగజారింది. కమిషనర్ హోదా ముఖ్య కార్యదర్శి నుంచి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ స్థాయికి పెరిగింది. కార్యదర్శి స్థాయి అధికారులను, అది కూడా తమ మాట జవదాటని వాళ్లను కమిషనర్ గా నియమించుకోవడం ముఖ్యమంత్రులకు సంప్రదాయంగా మారింది.

సీనియర్లను నియమిస్తేనే పాలన గాడిలోకి

తెలంగాణ ఏర్పడిన తరువాత సోమేశ్ కుమార్ కమిషనర్ గా కొనసాగారు. ఆయన బదిలీ తరువాత బి.జనార్దన్ రెడ్డి, దాన కిశోర్, డీఎస్.లోకేశ్ కుమార్,




రోనాల్డ్ రోస్, కాట అమ్రపాలి, ఇలంబర్తి, ప్రస్తుతం ఆర్వీ కర్ణన్ ఉన్నారు. వీరిలో ఏ ఒక్కరికి కూడా పట్టణాభివృద్ధి, వనరుల సమీకరణ పై కనీస అవగాహన లేదు. ఏ ప్రాతిపదికన నియమించారంటే చెప్పినట్లు తలూపుతారని, తమ మాట జవదాటి వెళ్లరని గుర్తించి నియామకం చేసుకున్నారు. ఎంసీహెచ్ గా ఉన్నప్పుడు ముఖ్య కార్యదర్శి హోదా అధికారి కమిషనర్ గా ఉంటే ఆ తరువాత వచ్చినవారు కార్యదర్శి, అంతకన్నా జూనియర్ అధికారులే కావడం శోచనీయం. ప్రస్తుత కమిషనర్ ఆర్వీ కర్ణన్ 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తలూపేవాళ్లను, ఆదేశాలను అమలు చేసే వారిని నియమించి కమిషనర్ హోదాను థర్డ్ గ్రేడ్ మునిసిపాలిటీ కమిషనర్ స్థాయికి దిగజార్చారు. వాస్తవానికి జీహెచ్ఎంసీ కమిషనర్ గా స్పెషల్ చీఫ్ సెక్రెటరీ స్థాయి ఐఏఎస్ ను నియమించి, అడిషనల్ కమిషనర్లుగా మరో అరడజన్ మంది సీనియర్ ఐఏఎస్ లను నియమించాల్సి ఉంటుంది. అప్పుడు కానీ పాలన గాడిలో పడుతుంది. ఈ ఉద్దేశంతోనే ఎంసీహెచ్ ను కాస్తా జీహెచ్ఎంసీగా ఏర్పాటు చేశారు.

తిష్టవేసిన డిప్యుటేషన్ అధికారులు

మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్ తో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల నుంచి పలువురు అధికారులు డిప్యుటేషన్ పై జీహెచ్ఎంసీ కి వచ్చి తిష్టవేశారు. చాలా మంది రెండు దశాబ్దాలకు మించి ఇక్కడే పనిచేస్తున్నారంటే ఎంత దరిద్రంగా అడ్మినిస్ట్రేషన్ ఉందో ఊహించుకోవచ్చు. కొందరైతే ఆరు నెలల పాటు తమ మాతృశాఖకు వెళ్లి తిరిగి మంత్రుల వద్ద పైరవీలు చేసుకుని జీహెచ్ఎంసీకి వస్తున్నారు. కొందరైతే వంద కోట్ల రూపాయల వరకు మూటగట్టుకున్నారంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. నిత్యం ఆదాయంపైనే యావ తప్ప నగర పౌరుల సమస్యలను పరిష్కరించాలనే తపన ఏ ఒక్క అధికారిలో ఉండదంటున్నారు. సంచిలో డబ్బుల కట్టలు లేకుండా ఏ ఒక్క అధికారి సాయంత్రం ఇంటికి వెళ్లరనే ఆరోపణలున్నాయి. బదిలీలు లేకపోవడం, కఠిన శిక్షలు అమలు చేయకపోవడం వీరికి వరంగా పరిణమించింది. కమిషనర్లు వస్తారు వెళ్తారు, తాము శాశ్వతం అనే విధంగా విర్రవీగుతుంటారనే విమర్శలూ లేకపోలేదు. అవినీతికి పాల్పడుతున్నట్లు నివేదికలు ఉన్నా శాఖాపరమైన చర్యలు తీసుకునే ప్రయత్నం చేయరు. కింది నుంచి పై స్థాయి వరకు క్రమశిక్షణ లోపించడం, జవాబుదారీతనం లేకపోవడం, రాజకీయ జోక్యం కారణంగా జీహెచ్ఎంసీ ప్రతిష్ఠ దిగజారుతున్నదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# ఎన్నికల సంఘంపై నీలినీడలు




న్యూఢిల్లీ,భారత ఎన్నికల సంఘం బీహార్ రాష్ట్రంలో చేపట్టిన ఓటర్ల జాబితా ముమ్మర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియ రేపిన దుమారం ఓ పట్టాన సద్దుమణిగేలా లేదు. ఎన్నికల సంఘం పనితీరుపై పలు సందేహాల్ని రేకెత్తించడమే కాకుండా సరికొత్త సవాళ్లను సంధిస్తోంది. దేశ అత్యున్నత న్యాయ స్థానమైన సుప్రీం కోర్టు ఇప్పటికే ఈ వ్యవహారంలో నిర్దిష్టమైన ఆదేశాలిచ్చింది. బీహార్‌లో అసాధారణంగా తొలగించిన 65 లక్షల మంది పేర్లు, తొలగింపు కారణాలను వివరాలతో వెల్లడించమని ఆదేశించింది. ఆ మేరకు ఎన్నికల సంఘం రాష్ట్ర ఉన్నతాధికారి సదరు జాబితాను ప్రకటించారు. మరోవైపు దేశంలో 'ఓట్ల దొంగతనం' జరుగుతోందనే ఆరోపణలతో విపక్ష నేత రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర' చేపట్టారు. 'ఒక ఓటర్ ఒకే ఓటు' నినాదాన్ని ప్రచారం చేస్తున్నారు. మరోపక్క, ఎన్నికల సంఘం ప్రతిష్ఠను భంగపరిచే విధంగా కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు కావాలనే నానారభస చేస్తున్నాయని పాలకపక్షం బిజెపి విమర్శిస్తోంది.ఇంకోపక్క వివాదాస్పదమైన ప్రకటన చేసి, విపక్ష నాయకుడ్ని ప్రజలకు క్షమాపణ చెప్పాలని 'వారం గడువు' విధించడం ద్వారా ఎన్నికల సంఘం ఈ రచ్చను పరాకాష్ఠకు చేర్చింది. ఫలితంగా విపక్ష 'ఇండియా' కూటమి పక్షాలు భేటీ అయి, కేంద్ర ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై అభిశంసనకు సూత్రప్రాయంగా నిర్ణయించాయి. దీంతో ఎన్నికల సంఘం ప్రతిష్ఠ దెబ్బతింటోంది. ప్రజలముందు దాని విశ్వసనీయత మరింత సన్నగిల్లుతోంది. తాజా వివాదం ఎక్కడిదాకా వెళుతుందో తెలీని స్థితి. ఎన్నికల సంఘం ప్రధానాధికారిపై 'అభిశంసన' అంటే ఒక సుప్రీం కోర్టు న్యాయమూర్తి 'అభిశంసన'కు అవసరమైన షరతులే వర్తిస్తాయి. ఉభయ సభల్లో, సభకు హాజరైన సభ్యుల్లో మూడింట రెండొంతల మంది 'అభిశంసన తీర్మానానికి' అనుకూలంగా ఓటు వేయాల్సి ఉంటుంది. అంటే లోక్‌సభలో 364/543, రాజ్యసభలో 160/240 సభ్యుల బలం కావాలి.అంతటి సంఖ్యా బలం విపక్ష 'ఇండియా' కూటమికి లేదు. అయినప్పటికీ 'అభిశంసనకు' విపక్షాలు సమాయత్తమవుతున్నాయంటే, తీర్మానం నెగ్గడం కన్నా కూడా ఎన్నికల సంఘాన్ని, తద్వారా పాలకపక్షాన్ని ఎండగట్టడమే వారి లక్ష్యంగా కనబడుతోంది. 'అభిశంసన విషయమై మాలో ఏకాభిప్రాయం ఉంది. తీర్మానం ప్రతిపాదించడానికి అవసరమైన సభ్యుల (కనీసం 50 మంది) సంఖ్య మాకుంది' అని 'ఇండియా' కూటమి పక్షాల భేటీ తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ అన్నారు. '2024 ఓటర్ల జాబితా తప్పుల తడక, అదొక మోసం..' అన్న బిజెపి నాయకుడు అనురాగ్ ఠాకూర్ మాటల్ని పట్టుకొని అటు కాంగ్రెస్, ఇటు తృణమూల్ కాంగ్రెస్ నాయకులు ఘాటైన విమర్శలుచేశారు. బీహార్‌లో జరుగుతున్న ఏకపక్ష జాబితా సవరణ, మూకుమ్మడి ఓట్ల తొలగింపును సమర్థించడానికే అలా మాట్లాడుతున్నారని, బిజెపి ఇసిఐ కుమ్మక్కుకు ఇదే నిదర్శనమని వారంటున్నారు.

2024 ఎన్నికల్లో ఉపయోగించిన ఓటర్ల జాబితా తప్పుల తడక అయితే, దాని ఆధారంగా జరిగిన ఎన్నికల్ని, తద్వారా ఏర్పడ్డ లోక్‌సభను రద్దు చేయగలరా? అని సవాలు విసురుతున్నారు. ఆర్‌జెడి ఎంపి మనోజ్ ఝా ఒకడుగు ముందుకు వేసి, 'రాహుల్ గాంధీని బెదిరిస్తూ, వారం గడువు విధిస్తూ మాట్లాడిన తీరు చూస్తే ఎన్నికల ముఖ్య కమిషనర్ కనబడలేదని, బిజెపి కొత్త అధికార ప్రతినిధి దర్శనమిచ్చారని వ్యాఖ్య చేశారు. వివిధ పక్షాల నేతలు కాకుండా పౌర సంస్థలకు చెందిన వారు నిర్దిష్టంగా లేవనెత్తిన అంశాలకు సమాధానమో, ఖండనతో సమాచారమో ఇవ్వకుండా ఎన్నికల కమిషనర్లు ప్రత్యారోపణలు చేయడంపట్ల ప్రజా క్షేత్రంలోనూ విమర్శలున్నాయి. రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక అధికారాలు కలిగిన భారత ఎన్నికల సంఘం వివిధ దశల్లో వివిధ రకాల అధికారాలతోపాటు బాధ్యతల్ని నిర్వహించాల్సి ఉంటుంది.కొన్ని విషయాల్లో రాష్ట్రపతికి, మరికొన్ని విషయాల్లో పార్లమెంట్‌కు, అలాగే న్యాయస్థానాలకు, ప్రజలకు జవాబుదారీగా ఉండా లి. జవాబుదారుతనం లోపించడమే కాకుండా పాలకపక్ష అనుకూల వైఖరి ఎన్నికల సంఘాన్ని విమర్శలపాలు జేస్తోంది. విపక్ష నేతలను అఫిడవిట్ ఇవ్వాలంటున్న ఇసి గతంలో అఖిలేష్ యాదవ్ (ఎస్‌పి) తో సహా పలువురు, నిర్దిష్ట ఆరోపణలతో సమర్పించిన అఫిడవిట్లకు ఎందుకు స్పందించలేదనే ప్రశ్న తలెత్తుతోంది. ఉత్తరప్రదేశ్‌లో 18,000 ఓట్ల తొలగింపుకు సంబంధించి సమాజ్‌వాదీ పార్టీ 2022లో ఇచ్చిన అఫిడవిట్‌కు ఇప్పటికీ అతీగతీ లేదు. అలా పలు రాష్ట్రాల్లో పలువురి అవిడవిట్లు తగిన స్పందన లేకుండానే పడున్నాయి. బీహార్‌లో సాగుతున్న ప్రస్తుత ఓటర్ జాబితా ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ విషయంలోనూ పలు ఆరోపణలు, నిర్దిష్ట విమర్శలూ ఉన్నాయి.వాటికి విస్పష్టమైన సమాధానాలే లేవు. 2003లో బీహార్‌లోనే జరిపిన ముమ్మర సవరణగానీ, ఇంకా ఇతర రాష్ట్రాల్లో జరిపిన 9 సవరణలకు భిన్నమైన వైఖరి బీహార్‌లో ఎందుకు అనుసరించారన్న ప్రశ్నకు ఇసి నుండి సమాధానం లేదు. వయోజనుడైన ప్రతి పౌరునికీ ఓటు హక్కు కల్పించాల్సిన ఎన్నికల సంఘం బాధ్యతను, బాధ్యతారహితంగా అది ఓటర్లుకే బదలాయించి, వారిని పౌరసత్వం నిరూపించుకొని అప్పుడు ఓటర్లు కావాలంటుందనే ఆరోపణలకు ఇసి స్పందించనే లేదు. అప్పటి వరకు ఎస్ఐఆర్‌లో ఉన్నట్టు 1. చనిపోయిన వారు, 2. శాశ్వతంగా వలసపోయిన వారు 3. రెండు లేదా అంతకన్నా ఎక్కువ చోట్ల ఓటర్లుగా నమోదైన వారు అని కాకుండా ఈసారి ప్రత్యేకంగా ఒక మతం వారిపైనే దృష్టి పెట్టి 'విదేశీ అక్రమవలసదారులు అంటూ ఇంత రచ్చ చేసిందనేది ప్రధాన విమర్శ.ఇలా మతప్రాతిపదికన ఓటు హక్కు కల్పించడం నిరాకరించడం రాజ్యాంగ వ్యతిరేకమనే విమర్శకు కూడా ఇసి నుండి సమాధానం లేదు. 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటికట్ రైట్స్' (ఎడిఆర్) ఇటువంటి విమర్శలే చేసింది.కేంద్రంలోని బిజెపి నేతృత్వపు ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ పౌరసత్వ నమోదు (ఎన్ఆర్‌సి) కి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. దాని అమలు సంఘ్ సంకల్పం. అందుకు అనుకూలంగా ఎన్నికల సంఘం వ్యవహరించిందనేది అభియోగం. రేపు దేశవ్యాప్తంగా జరుపతలపెట్టిన 'ఎస్ఐఆర్'కు, బీహార్‌ను పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకుంది. 'ఓటరు నమోదు 'అసలైన ఓటరు నిర్ధారణ పౌరుల బాధ్యత' అన్నట్టు ప్రజలపైనే మోపింది. దానికి పౌరసత్వాన్ని నిరూపించుకునే మెలికపెట్టింది.అందుకే, 1987కు ముందు పుట్టిన వారైతే పుట్టిన తేదీ, ప్రాంతం, భారత పౌరసత్వంపై తగిన ప్రమాణ పాత్రలతో నిరూపించుకోవాలని, 1987– 2004 మధ్యలో పుట్టిన వారైతే తన పుట్టిన తేదీతోపాటు తల్లిదండ్రులలో ఒకరి పుట్టిన తేదీని నిర్ధారించాలని, 2004 తర్వాత పుట్టిన వారైతే తన పుట్టిన తేదీతోపాటు తల్లిదండ్రుల ఇద్దరి పుట్టిన తేదీలను ధ్రువీకరించాలని ఈ ప్రక్రియ నిర్దేశిస్తోంది.

# 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

హైదరాబాద్, రాష్ట్రంలో రైతులకు తగినంత యూరియా సరఫరా చేయాలంటూ కేంద్రంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు చేసిన పోరాటం ఎట్టకేలకు ఫలించింది. తెలంగాణ రాష్ట్రానికి 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసేందుకు కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మొత్తం ఈ వారంలో తెలంగాణకు సరఫరా చేస్తామని సదరు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దీంతో కర్ణాటక నుంచి 10,800 మెట్రిక్ టన్నుల యూరియా షిప్ మెంట్ ప్రారంభం కానుంది. ఈ వారంలో మరో మూడు షిప్‌మెంట్ ల ద్వారా యూరియా సరఫరాకు కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు ఆదేశాలు జారి చేసింది. రాష్ట్రంలో యూరియా కొరతపై పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ ఎంపీలు ఆందోళనలకు దిగారు. దీంతో తెలంగాణ రైతాంగం యూరియా కోసం పడుతున్న కష్టాలు దేశానికి తెలిసింది. దీంతో కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రిత్వ శాఖ స్పందించింది. కేంద్రం తెలంగాణకు యూరియా సరఫరా చేయడంపై రాష్ట్ర ఎంపీలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. ప్రతి పక్ష పార్టీలు రాజకీయ స్వార్థం కోసం చేసే కుట్రలపై ఆలోచన చేయాలంటూ రైతాంగానికి ఆయన కీలక సూచన చేశారు. తెలంగాణకు కేటాయించిన యూరియా సరఫరా చేయకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష కారణంగానే రైతులకు ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. తెలంగాణ రైతుల శ్రేయస్సు కోసం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుం–దని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. తెలంగాణలో రైతులకు యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు యూరియా సరఫరా చేయకుండా కేంద్రంలోని మోదీ సర్కార్ మీనమేషాలు లెక్కిస్తుందని రాష్ట్ర ప్రభుత్వంలోని అగ్రనేతలు ఆరోపించారు. అంతేకాకుండా.. బీజేపీ యేతర పాలిత రాష్ట్రలపై మోదీ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందంటూ వారు మండిపడ్డారు. యూరియా కొరతపై దేశ రాజధాని ఢిల్లీ సాక్షిగా నిలదీయాలంటూ పార్టీ ఎంపీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం సూచించిన సంగతి తెలిసిందే.

# సభలో ప్లకార్డులు, బ్యానర్లు నిషేధం

న్యూఢిల్లీ,జూలై 21న ప్రారంభమైనప్పటి నుంచి ఉభయ సభల్లో బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ పక్రియపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం చర్చకు అంగీకరించడం లేదు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ హౌస్‌లో, వెలుపల ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని నిరసనలు కొనసాగిస్తున్నారు. వారి నిరసనలతో పార్లమెంటు దద్దరిల్లుతోంది. దీంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభను వాయిదాల పర్వం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో హౌస్‌లోకి బ్యానర్లు, ప్లకార్డులను తీసుకురావద్దని ప్రతిపక్ష ఎంపీలను బుధవారం లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కోరారు. చర్చలు సజావుగా సాగేందుకు ప్రతిపక్ష సభ్యులు సహకరించాలని స్పీకర్ కోరారు. ఎస్ఐఆర్‌పై చర్చకు డిమాండ్ చేస్తూ.. ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో సభకు అంతరాయం కలిగిందని స్పీకర్ తెలిపారు. కాగా, ఈ సందర్భంగా చెక్క కర్రలతో కట్టిన బ్యానర్లు సభలో సముచితం కాదు. మీలో చాలామంది నినాదాలు చేస్తారు, కర్రలు, ప్లకార్డులు, బ్యానర్లు తీసుకువస్తారు. కానీ వీటిని ఇలా సభకు తీసుకురావడం తగిన చర్య కాదు. మీరందరూ రాజకీయ పార్టీలకు చెందినవారు కాబట్టి.. మీరు సభకు సహకరించాలి అని స్పీకర్ ఓంబిర్లా ప్రతిపక్ష సభ్యులనుద్దేశించి వ్యాఖ్యానించారు.

# మునిగిన మెట్రో..!

ముంబై:భారీ వర్షాలు ముంబైను ముంచెత్తుతున్నాయి. 6 గంటల్లో 200 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. వర్ష బీభత్సానికి మొత్తం పది మంది ప్రాణాలు కోల్పోయారు. కుండపోత ప్రభావం రోడ్డు, రైలు, విమాన సర్వీసులపైనా ప్రభావం తీవ్రంగా పడింది. పలు ప్రాంతాల్లో రోడ్లు చెరువులను తలపించాయి. వాహనదారులు, ప్రయాణికులు నడుముల్లోతు వరదలోనే ముందుకు సాగాల్సి వచ్చింది.

అస్తవ్యస్తమైన జనజీవనం

రైలు మార్గాలపై కొన్ని ప్రాంతాల్లో 8 సెంటీమీటర్ల మేర వరద చేరడంతో సెంట్రల్ రైల్వే నడిపే అత్యంత కీలకమైన సబర్బన్ సర్వీసులను రద్దు చేసింది. దీంతో, ప్రయాణికులు ఎక్కడివారక్కడే ఉండిపోయారు. రైళ్లు పట్టాలపైనే నిలిచిపోవడంతో జనం బయటకు దూకి వరద నీళ్లలోనే గమ్యస్థానాలకు కాలినడకన బయలుదేరారు. స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు పనిచేయలేదు. హైకోర్టు సైతం మధ్యాహ్నం 12.30 గంటల వరకే పనిచేసింది.

స్తంభించిన రైలు, రోడ్డు, విమాన సర్వీసులు

మంగళవారం 345 విమానాలకు రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. మరోవైపు సుమారు 700 మందితో నిన్న సాయంత్రం బయలుదేరిన మోనో రైళ్లు రెండు అర్థంతరంగా నిలిచిపోవడంతో ప్రయాణికులు హాహాకారాలు చేశారు. మైసూర్ కాలనీ భక్తి పార్క్ స్టేషన్ల మధ్యన ఉండగా విద్యుత్ సరఫరా లోపంతో అర్థంతరంగా నిలిచిపోయింది.

మధ్యలో నిలిచిపోయిన రెండు మోనో రైళ్లు

అయితే ఏసీ పనిచేయకపోవడంతో అందులోని 582 మంది గంటపాటు ఉక్కిరిబిక్కిరియ్యారు. స్పృహతప్పిన కనీసం 15 మందిని ఆస్పత్రిలో చేర్పించారు. ఫైర్, మున్సిపల్ సిబ్బంది ప్రయాణికులందరినీ సురక్షితంగా ఖాళీ చేయించి, బస్సులో గమ్యస్థానాలకు పంపించారని సీఎం ఫడ్నవీస్ చెప్పారు. వడాలా స్టేషన్‌కు సమీపంలో 200 మంది ప్రయాణికులతో నిలిచిపోయిన మరో మోనోరైలును అధికారులు విజయవంతంగా వెనక్కి తీసుకెళ్లారు.

వచ్చే 48 గంటలు కీలకమన్న సీఎం

గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇప్పటి వరకు 21మంది చనిపోయారు. వచ్చే 48 గంటలు అత్యంత కీలకమైన సమయమని సీఎం అన్నారు. ముంబై, థానె, రాయ్‌గఢ్, రత్నగిరి, సింధుదుర్గ్ జిల్లాల్లో హై అలెర్ట్ ప్రకటించామని చెప్పారు.

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని జురాల, కోయిల్ సాగర్ ప్రాజెక్టుకు వరద

ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు కోయిల్ సాగర్ ప్రాజెక్టుకు.. భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టుకు సంబంధించిన ఐదు గేట్లను పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు అధికారులు. ప్రాజెక్టు నీటిమట్టం 2.32 టీఎంసీలుగా ఉంది. ప్రస్తుతం 2.12 టీఎంసీలుగా కొనసాగుతుంది. 7వేల 200 క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేస్తున్నారు.

కృష్ణా, గోదావరి నదులకు పెరుగుతున్న వరద ఉధృతి

భారీ వర్షాలకు కృష్ణా, గోదావరి నదుల వరద ప్రవాహం పెరుగుతోంది. ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ప్రాజెక్టు ప్రస్తుత ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 4.92 లక్షల క్యూసెక్కులుగా ఉంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 42 అడుగులకు చేరింది. ధవళేశ్వరంలో కాటన్ బ్యారేజి ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 7.38లక్షల క్యూసెక్కులుగా ఉంది.

## విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ ముసుగు తొలగలేదు

విశాఖపట్టణం, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రజానీకం యావత్తు ముందుకు రావాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి. హెచ్.నరసింగరావు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, ప్రధాన కార్యదర్శి, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ యు.రామస్వామి విశాఖలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్రైవేటీ-రణను ఆపలేదని గత ప్రభుత్వాన్ని ప్రజలు ఘోరంగా ఓడించారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు విశాఖ స్టీల్ ప్రైవేటీ-కరణ కానివ్వమని గట్టిగా హామీ ఇచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నేడు పూర్తిగా కేంద్ర బిజెపి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీ-కరణను సమర్థిస్తున్నదని మండిపడ్డారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను 34 విభాగాలుగా చేసి ఆపరేషన్, మెయిం-టె-నెన్స్ మొత్తం పనులను కొత్త కాంట్రాక్టర్లకు అప్పగించాలని ఆగష్టు 16న ఆశక్తి గలవారు సెప్టెంబరు 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని బిడ్‌లు ప్రకటించారని తెలిపారు. దీని వలన పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, ఆఫీసర్లతో సహా మొత్తం పనులన్నీ కొత్త కాంట్రాక్టర్లకు అప్పగిస్తారని తెలిపారు. స్థానికులుగా ఉన్నవాందరూ పూర్తిగా పనులు కోల్పోతారని, గాజువాక ప్రాంతం ఎడారిగా మారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వ సాయంతో కేంద్ర ప్రభుత్వం 5వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా, ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం చెల్లించకుండా ఏకపక్షంగా తొలగించారు. రెండు దఫాలు వి.ఆర్.ఎస్ పేరుతో అత్యంత నైపుణ్యం కలిగిన ఆఫీసర్లు, కార్మికులను బయటకు గెంటివేస్తున్నారని ఆగ్రహించారు. గత ప్రభుత్వ కాలంలో కొత్తవారిని తీసుకోవాలని పోరాడామని, గత ప్రభుత్వం ప్రైవేటీకరణను ఆపలేక పోయిందని తెలిపారు. నేడు కూటమి ప్రభుత్వం వున్న కార్మికులనే వేలాది మందిని తొలగించి ప్రైవేట్‌వారికి అప్పగించడానికి పూనుకుంటు-న్నదని పేర్కొన్నారు. కార్మికులపై పూర్తిగా నిర్బంధం ప్రయోగించడానికి యాజమాన్యానికి అవకాశం కల్పించిందని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని వెల్లడించారు. విశాఖ స్టీల్‌లో తల తిప్పకుండా ఉండేవిధంగా ఎమర్జన్సీని సాగిస్తున్నదని, నిరాహారదీక్షా శిబిరాన్ని కూల్చివేసారని, నిరాహారదీక్షలకు అనుమతించడం లేదని మండిపడ్డారు. కార్మికులను భయపెట్టి ప్రైవేటీకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదన్నారు. ఇప్పటివరకు బిజెపి చేసిన తప్పుడు వాదనలను టిడిపి నాయకులు భుజానవేసుకొని అదే వాదనలు చేస్తున్నారని తెలిపారు.వాస్తవాలు కప్పిపుచ్చి బిజెపి ప్రభుత్వ కుట్రలో భాగంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఇప్పుడున్న 300 మంది స్థానిక కాంట్రాక్టర్లను తొలగించి బయట వారిని రప్పించి ఆర్సీలార్ మిట్టల్‌కు అప్పగించడానికి రంగం సిద్ధం చేసిందన్నారు. పల్లా శ్రీనివాస్ పదే పదే విశాఖ స్టీల్‌లో ఉన్న ట్రేడ్ యూనియన్లపై తీవ్రంగా విరుచుకుపడ్డారని, 2వేల మంది పనిచేయని ట్రేడ్ యూనియన్ నాయకులున్నారని ఆరోపించారని మండిపడ్డారు. పనిచేయని కార్మికులు ఎవరున్నారో చూపించాలని సవాల్ చేశారు.కొంతమంది టియు నాయకులు కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగాలు అమ్ముకున్నారని పదే పదే ప్రకటిస్తున్నారని, చిత్తశుద్ధి ఉంటే సిబిఐ, ఎసిబి అన్ని సంస్థలతో వెంటనే విచారణ జరిపించాలని సవాలు విసిరారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రేడ్ యూనియన్లు, కార్మికులు శ్రమతోనే స్టీల్ ఉత్పత్తి అవుతున్నదని, ప్రతి సంవత్సరం 50లక్షల టన్నులు ప్రాణాలను ఫణంగా పెట్టి కార్మికులు ఉత్పత్తి చేస్తున్నారని వెల్లడించారు. ఉత్పత్తి చేసే వారిపై హేళన చేయడం, కఠినంగా ఉంటామని హెచ్చరికలు చేయడానికి వీరికి ఏమి అధికారం ఉందని ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఇప్పటికీ అన్ని కార్మిక సంఘాలు, కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు, ఆఫీసర్లు కలిసి పోరాటాలు చేస్తున్నామని, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటి ఆధ్వర్యంలో ఈ పోరాటం సాగుతున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ను ప్రవేట్ చేయాలనే ప్రయత్నాలు ముమ్మరం చేసిందని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు సమకూర్చడం లేదని వెల్లడించారు. విశాఖ స్టీల్‌ఎ÷-లాంట్ 30సంవత్సరాల నుండి ఉత్పత్తి చేస్తున్నా సొంతగనులు ఇవ్వకుండా ఆర్సీలార్ మిట్టల్‌కు సొంతగనులు ఇవ్వాలని టిడిపి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నదని ఆగ్రహించారు. టాటా, జిందాల్ స్టీల్‌ఎ÷-లాంట్‌లు కూడా చేసిన ఒప్పందాలు విఫలమయ్యాయని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆర్సీలార్ మిట్టల్‌ను రంగంలోకి దించుతున్నారని ఆగ్రహించారు.

## బదిలీలు,పదోన్నతులు,సెటిల్మెంట్లు

హైదరాబాద్,అతడు ఎమ్మెల్యే కాదు. అధికార పార్టీ నాయకుడు అంతకన్నా కాదు. ఒకరకంగా రాజకీయ దళారి. అంటే అధికారంలో ఏ పార్టీ ఉంటే అక్కడికి వెళ్ళిపోతాడు. ఆ పార్టీ ముఖ్యులతో సంబంధాలు పెంచుకుంటాడు. వారి అవసరాలు తీర్చుతాడు. ఆ తర్వాత రంగ ప్రవేశం చేస్తాడు. ఆ తర్వాత తన టార్గెట్ ఫినిష్ అయ్యేంతవరకు వసూలు చేసుకుంటూనే ఉంటాడు. పై వారి అండదండలు ఉంటాయి కాబట్టి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తుంటాడు.తెలంగాణ ఏర్పడిన తర్వాత అధికారంలోకి ఓ పార్టీ వచ్చింది. ఆ పార్టీలో అత్యంత పెద్ద నాయకురాలికి అప్పట్లో ఇతడు సన్నిహితుడుగా మారిపోయాడు. గడచిన పది సంవత్సరాలు దర్జాగా దందా సాగించాడు. పదేళ్ల తర్వాత తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ ముఖచిత్రం మారిపోవడంతో.. ఒక్కసారిగా తన ప్లేట్ ఫిరాయించాడు. ప్రభుత్వంలో అత్యంత కీలకంగా ఉన్న వ్యక్తికి దగ్గరయ్యాడు. తన దగ్గర ఉన్న నోట్ల కట్టలు విసిరేశాడు. అత్యంత కీలకమైన పోలీస్ శాఖలోకి అడుగు పెట్టాడు. బదిలీలు, పదోన్నతులు, సెటిల్మెంట్లు.. ఇలా ఇష్టానుసారంగా చేయడం మొదలుపెట్టాడు. కొందరు డిసిపిలతో హైదరాబాద్ ఏరియాలో ల్యాండ్ సెటిల్మెంట్లు, స్పా సెంటర్లలో వసూళు ్లు, క్లబ్బులలో పేకాట శిబిరాలు, పబ్బులలో అసాంఘిక కార్యకలాపాలు.. ఇలా డబ్బుల వసూలుకు అవకాశం ఉన్న ఏ విభాగాన్ని కూడా అతడు వదిలిపెట్టడం లేదు. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్ నగరం అనేది అత్యంత కీలకమైనది. ఇది తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే కాదు, దేశానికే దిక్సూచి లాంటిది. ఇక్కడ ప్రపంచ స్థాయి కర్మా గారాలు, ప్రపంచ స్థాయి కంపెనీలు ఉన్నాయి. ఇవన్నీ కూడా సక్రమంగా సాగాలి అంటే శాంతిభద్రతలు అవసరం.శాంతి భద్రతల విషయంలో ప్రభుత్వాలు రాజీ పడితే ఆ ప్రభావం రాష్ట్ర ప్రగతి మీద పడుతుంది. కానీ ఆ విషయాన్ని ఆ ప్రైవేట్ వ్యక్తి పూర్తిగా మర్చిపోయాడు.. పోలీసులతో అంట కాగుతూ దందాలకు పాల్పడుతున్నాడు. డీసీపీ లతో హైదరాబాద్ శివారు ప్రాంతాలలో ల్యాండ్ సెటిల్మెంట్లు చేస్తున్నాడు. పబ్బులు, క్లబ్బులలో గబ్బు యవరాలకు పాల్పడుతున్నాడు. వాటి ద్వారా దండిగా సంపాదిస్తున్నాడు. అయితే ఇతడు ప్రభుత్వంలోని పెద్దకు కీలకంగా ఉండడంతో ఎవరు ఏమీ అనలేకపోతున్నారు. ఇతడి ఆగడాలు ఇటీవల కాలంలో మరింత శృతిమించిపోయాయి. దీంతో ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రభుత్వంలోని కీలక వ్యక్తికి నివేదిక ఇచ్చాయి. అయితే దీనిపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుంది? ఆ షాడో వ్యక్తిని ఏం చేస్తుందనేది? చూడాల్సి ఉంది. ఒకవేళ చర్యలు తీసుకోకపోతే.. అతడు చేస్తున్న ఆగడాలను అలానే చూస్తూ ఉండిపోతే దాని పర్యవసనాలు కూడా తీవ్రంగానే ఉంటాయి.

# కేసీఆర్‌కు బీజేపీ షాక్! వెనుక స్కెచ్ ఇదే!




న్యూఢిల్లీ,బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటవ్వడం ఖాయమేనా? లేక బీఆర్ఎస్ కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి లొంగిపోతున్నట్లు ఆ పార్టీతో లోపాయికారిగా లొంగుబాటు ఒప్పందమేమైన చేసుకుంటుందా..? ఇటీవల ఒక్కొక్కరు కారు దిగి కమలం పార్టీ మెట్లు ఎక్కుతుండటం ఆ పరోక్ష ఒప్పందంలో భాగమేనా?.. ఇదంతా రెండు పార్టీల విలీన ప్రక్రియలో భాగమేనా? అన్న సందేహాలు ఇప్పుడు పొలిటికల్ సర్కిల్స్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. అసలు బీఆర్ఎష్, బీజేపీలు అవెంజర్స్ అవుతాయా..? రాబోయే కాలంలో కూడా రివేంజర్స్‌గానే కొనసాగుతాయా?

**బీజేపీకి లొంగిపోవడానికి బీఆర్ఎస్ సిద్ధమైందని ప్రచారం**

బీఆర్ఎస్ పార్టీ గత్యంతరం లేని స్థితిలో బీజేపీకి లొంగిపోవడానికి సిద్ధమవుతోందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తాము అధికారంలో ఉన్నప్పుడు పార్లమెంటులో ఎన్డీఏ సర్కారు బిల్లులకు మద్దతిచ్చిన గులాబీ పార్టీ తర్వాత మారిన పరిస్థితుల్లో కేంద్రంతో తెగతెంపులు చేసుకున్నట్లు వ్యవహరిస్తోంది. అయితే ఇప్పుడు గులాబీ గూటి నుంచి ఒకొక్కరుగా కమలం చేరుతుండటం వెనుక లెక్కలేంటనేది చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యేల కొనుగోలులో బీజేపీ జాతీయ నేత బీఎల్ సంతోష్ ను పట్టుకున్నామని బీఆర్ఎస్ చెబుతుంటే.. దానికి రివెంజ్‌గా లిక్కర్ స్కాం లో కవితను తీహార్ జైల్లో నెలల తరబడి ఊసులు లెక్కపెట్టించాం అంటోంది బీజేపీ.

**కారు బోల్టులు ఉడదీసే పనిలో పడినట్లు కనిపిస్తున్న బీజేపీ**

అంతేకాదు లిక్కర్ స్కాం అరెస్టులతో ఆగకుండా కారు పార్టీ బోల్ట్ లు ఊడదీసే పనిలో బీజేపీ బిజీబిజీగా గడుపుతున్నట్టు టాక్ వినిపిస్తోంది. తాజాగా బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీజేపీ తీర్థం పుచ్చుకోవడంతో బీఆర్ఎస్ లో మరోసారి రాజీనామాల సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. రానున్న కాలంలో కారు పార్టీ నుంచి కమలం లోకి చేరికలు భారీగా ఉంటాయంటున్నారు. దాంతో కేసీఆర్ టీమ్ డైలమాలో పడినట్టు కనిపిస్తోంది. బోల్ట్ లూడదీస్తున్న మోడీ, షాలను వదిలి కేటీఆర్ 18 నెలల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తుండటం, బీజేపీని పల్లెత్తు మాట అనకపోవడం బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య రక్షా బంధన్ బహిర్గతం అవుతుందనే టాక్ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది.

**జోరందుకున్న బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని ప్రచారం**

ఆ క్రమంలో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే, ఎప్పటికైన బీఆర్ఎస్ బీజేపీలో విలీనం అవుతుందనే చర్చ మళ్ళీ జోరందుకుంటోంది. లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవిత పట్టుబడ్డారా? లేక బీజేపీ బదనాం చేసిందా అన్న అంశాల్లో లోగుట్టు పెరుమాళ్లకు ఎరుక. అయితే కవిత బెయిల్‌పై బయటకు వచ్చాక కారు పార్టీని వదిలి సొంత కుంపటి జాగృతితో ముందుకు వెళ్లున్నారు. అంతేకాదు బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే.. బీజేపీలో విలీనం చేసేందుకు ప్రయత్నం జరిగింది అంటూ పెద్ద బాంబే పేల్చారు కవిత. కవితే కాదు సీఎం రమేష్, కమలంలో చేరిన గువ్వల బాలరాజులతో పాటు, వివిధ రాజకీయ పార్టీల కీలక నేతలు సైతం బీజేపీ, బీఆర్ఎస్ విలీనం తథ్యం అని స్టేట్‌మెంట్లు ఇస్తుండటం హాట్ టాపిక్‌గా మారింది. అంతేకాదు కేసీఆర్, కేటీఆర్‌లకు నమ్మిన బంటునని చెప్పుకునే గువ్వల బాలరాజు గులాబీబాస్ వ్యూహంలో భాగంగానే కాషాయ కండువా కప్పుకున్నారంటున్నారు.

**బీఆర్ఎస్ ను ఖాళీ చేయడానికి బీజేపీ ప్రణాళికలు..**

ఉద్యమ పార్టీగా ప్రస్థానం మొదలుపెట్టిన గులాబీ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమకారులను పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. అధికారంలో ఉన్న సమయంలో టీజీపీఎస్సీ పేపరు లీకేజీ, కాళేశ్వరం బ్యారేజ్, విద్యుత్ కొనుగోలు, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ కార్ రేస్ స్కాం వంటి అవినీతి ఆరోపణలతో పాటు, కవిత తిరుగుబాటుతో తెలంగాణలో రాజకీయంగా బీఆర్ఎస్ ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఇదే అదునుగా ఎమ్మెల్యేల కొనుగోలుకు, లిక్కర్ స్కాం తో రివెంజ్ ఇచ్చిన బీజేపీ, తాజాగా బీఆర్ఎస్ కు మరో స్ట్రోక్ ఇచ్చేందుకు కసరత్తులు చేస్తోందట. బీఆర్ఎస్ ను ఖాళీ చేసేందుకు ప్రణాళికలు రచిస్తోందంట. మొత్తానికి పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ కారు పార్టీ పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నటుగా తయారైందట. ఓటమి తరువాత అన్ని రాజకీయ పార్టీలు కేసీఆర్ వైపే వేలెత్తి చూపిస్తున్న పరిస్థితి. గత లోక్‌సభ ఎన్నికల్లో ఖాతా తెరవలేకపోయిన బీఆర్ఎస్ ఏకంగా సగం స్థానాల్లో డిపాజిట్లు కూడా కోల్పోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాలు గెలుచుకుని అధికారం కోల్పోయిన గులాబీపార్టీకి ఇప్పుడు 28 మంది ఎమ్మెల్యేలే మిగిలారు. వారిలో ఎంత మంది పార్టీలో కొనసాగుతారో గ్యారెంటీ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో గులాబీ బాస్ ఫాంహౌస్‌కే పరిమితమవుతున్నారు.

**బీజేపీ పంచకు చేరిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**

అధికారం కోల్పోయి పార్టీ అధినేత కేసీఆర్ ఫాం హౌస్ కే పరిమితం కావడంతో బీఆర్ఎస్‌లో నాయకత్వలేమి స్పష్టంగా కనిపిస్తోంది. తాజాగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిజెపి తీర్థం పుచ్చుకోవడంతో, ఆ పార్టీ నుంచి మరిన్ని చేరికలు బిజెపిలో ఉంటాయని బిజెపి వర్గాలు చెబుతున్నాయి. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా పోటీ చేసి, ఓడిపోయిన వారితోపాటు కీలక నేతలంతా బిజెపి వైపుకు చూస్తున్నారని టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే బీజేపీతో నేతలంతా టచ్‌లో ఉన్నారని, చర్చలు జరిపారని త్వరలోనే భారీ ఎత్తున బిజెపిలో చేరబోతున్నారన్న ప్రచారం గట్టిగానే నడుస్తోంది. దాంతో బిజెపిలో బీఆర్ఎస్ విలీనం అవుతుందనే ఉహాగానాలకు మరోసారి ఊతమిచ్చినట్లైంది. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో కేసీఆర్ రోల్ ఎలా ఉండబోతుందనేది అంతుపట్టకుండా తయారైంది. అసలు బీఆర్ఎస్ ఉంటుందా..? బీజేపీలో విలీనం చేస్తారా..? లేక టీఆర్ఎస్ గా మార్చి మళ్ళీ సెంటిమెంటీట్‌ను రగిలిస్తారా..? లేక బీజేపీతో లొంగుబాటు రాజకీయ ఒప్పందాలు కంటిన్యూ చేస్తారా.? అన్న సస్పెన్స్ కొనసాగుతోంది. మొత్తమ్మీద గులాబీ పార్టీ మనుగడ ప్రశ్నార్థంగా తయారైందన్న వాదన గట్టిగానే వినిపిస్తోందిప్పుడు.

# పేదలపక్షపాతి...జస్టిస్ సుదర్శన్ రెడ్డి



న్యూఢిల్లీ,ఉప రాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేయడంతో ఎన్నిక అనివార్యం అయ్యింది. బలాబలాలు గమనిస్తే ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ ఎన్నిక కావడం లాంఛనమే కానుంది. ఎందుకంటే ఎన్‌డీఏ కూటమికి తగినంత బలం ఉంది. అయితే ఇక్కడ అభ్యర్థుల గుణగణాలు, వారి వ్యక్తిత్వం పరిశీలిస్తే ఇద్దరూ వజ్రం లాంటి వారే. ఎందుకంటే గతంలో జరిగిన పోటీల్లో కూడా వారు తమ నిజాయితీతో బతుకుతున్న వారే. ఇప్పటివరకు 16 ఉప రాష్ట్రపతి ఎన్నికలు జరిగాయి. సర్వేపల్లి రాధాకృష్ణన్, గోపాల్ స్వరూప్ పాఠక్, జస్టిస్ మహమ్మద్ హిదయతుల్లా, శంకర్‌దయాళ్‌శర్మలు మాత్రమే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన అన్ని ఎన్నికల్లో ప్రతిపక్షాలు అభ్యర్థిని నిలబెట్టాయి. ప్రధానమంత్రిగా మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత 2017లో తొలిసారి జరిగిన ఎన్నికలో అధికారపార్టీ అభ్యర్థి ఎం.వెంకయ్యనాయుడుపైన ప్రతిపక్షాలు గోపాలకృష్ణ గాంధీని నిలబెట్టాయి. 2022లో జరిగిన ఎన్నికలో జగదీప్‌ధన్‌ఖడ్‌పై కర్ణాటకకు చెందిన మార్గరెట్ అల్వాను రంగంలోకి దింపాయి. ఇప్పుడు తెలంగాణకు చెందిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేశాయి. ఈ మూడు ఎన్నికల్లో ప్రతిపక్షాల నుంచి దక్షిణాదివారే అభ్యర్థులు కావడం విశేషం.ఈ పోటీ ఎలా ఉన్నా..ఎవరు గెలిచినా విభిన్న వ్యక్తిత్వాల కలగిన ఇద్దరు వ్యక్తుల గుణగణాలను తెలుసుకునే అవకాశం కలిగింది.ప్రధానంగా జస్టిన్ సుదర్శన్ రెడ్డి న్యాయ కోవిదుడు. నిక్కచ్చిగా,నిర్మొహమాటంగా ఉండే వ్యక్తి. ఆయన సుప్రీం న్యాయమూర్తిగా ఇచ్చిన తీర్పులను పరిశీలిస్తే ఇది అర్థం అవుతుంది. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి దేశంలో పేరొందిన ప్రగతిశీల న్యాయకోవిదుడు. ఆయన సుదీర్ఘ కాలం న్యాయ వ్యవస్థలో ఎన్నో హోదాల్లో పనిచేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం నిరంతరం ధైర్యంగా పోరాడారు. అంకుమించి పేదల పక్షపాతిగా పేరుంది. ఆయన రాసిన తీర్పులను చదివితే పేదలకు అనుకూలంగా ఎలా వ్యవహరించారు, రాజ్యాంగాన్ని, ప్రాథమిక హక్కులను ఎలా రక్షించారన్నది తెలుస్తుంది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వెంకయ్యనాయుడు తర్వాత పోటీ చేస్తున్న రెండో తెలుగు వ్యక్తిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి నిలవనున్నారు. జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి 1946 జులై 8న రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. 1971లో ఉస్మానియా యూనివర్సిటీలో న్యాయశాస్త్రంలో పట్టా పొంది అదే సంవత్సరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. సీనియర్ న్యాయవాది కె.ప్రతాప్‌రెడ్డి వద్ద జూనియర్‌గా చేరారు. హైదరాబాద్ సిటీ- సివిల్‌కోర్టు, హైకోర్టుల్లో న్యాయవాదిగా వృత్తి జీవితం ప్రారంభించారు. 1988-90 మధ్య హైకోర్టులో ఆంధప్రదేశ్ ప్రభుత్వ న్యాయవాదిగా సేవలందించారు. 1990లో సుమారు ఆరు నెలలపాటు- కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు స్టాండింగ్ కౌన్సిల్‌గానూ పనిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి న్యాయ సలహాదారుగా, స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. 1993లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1995 మే 2న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005 డిసెంబరు 5న గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2007 జనవరి 12 నుంచి 2011 జులై 7 వరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలందించారు. 2013 మార్చిలో గోవా తొలి లోకాయుక్తగా నియమితులయ్యారు. ఆనాటి గోవా సిఎం పణిక్కర్ ఏరికోరి సుదర్శన్ రెడ్డిని లోకాయుక్తకు నియమించారు. ఓ రకంగా సుదర్శన్ రెడ్డి నిజాయితీ కారణంగానే ఈ పదవి దక్కింది. ప్రస్తుతం ఐఏఎంసీ శాశ్వత ట్రస్టీగా, బీసీ కులగణన అధ్యయన కమిటీ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మానవ హక్కుల పరిరక్షణకు పెద్దపీట వేశారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పలు కీలక తీర్పులు వెలువరిం చారు. ఛత్తీస్‌గఢ్‌లో తీవ్రవాదులను ఎదుర్కోవడానికి ఏర్పడిన సల్వాజుడుంను నిషేధిస్తూ తీర్పు ఇచ్చారు. మానవ హక్కుల పరిరక్షణ, చట్టబద్ధ పాలన లక్ష్యంగా ఈ తీర్పు వెలువరించారు. ఆర్మీ వైద్య కళాశాలలో పదవీ విరమణ పొందిన సైనికులు, సైనిక సిబ్బంది వితంతువుల పిల్లలకు అడ్మిషన్‌లు నిరాకరించడం చెల్లదని, దీనివల్ల అణగారిన వర్గాలకు న్యాయం జరగదన్నారు. న్యాయవ్యవస్థ స్వతంత్రతను పరిరక్షిం చడంలో భాగంగా... న్యాయమూర్తులపై ఆరోపణలతో వచ్చే ప్రజాప్రయోజన పిటిషన్‌లను అనుమతించ రాదని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తిగా ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనానికి నేతృత్వం వహిస్తూ అసైన్డ్ భూసేకరణపై కీలకమైన తీర్పు వెలువరించారు. అసైన్డ్ భూములకు భూసేకరణ చట్టం కింద చట్టబద్ధమైన పరిహారం చెల్లించాలని తీర్పు వెలువరించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఇప్పటి వరకు ఉప రాష్ట్రపతిగా ఉన్న జగదీప్ దన్‌ఖడ్ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే రాజీనామా చేశారు. ఈ హఠాత్పరిణామం, ఇప్పటి వరకూ ఒక రాజ్యాంగ హోదాగా భావిస్తున్న ఉప రాష్ట్రపతి పదవి విలువపై చర్చకు దారితీసింది. మరో రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల కమిషన్ పనితీరుపై దాదాపు నెలరోజులుగా వర్షాకాల సమావేశాలు స్తంభించిపోయాయి. ప్రజల ఓట్లనే కొల్లగొడుతున్నారంటూ ప్రతిపక్షాలు వీధి ఆందోళనలకు దిగాయి. ఈ పరిస్థితుల్లో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో పోటీకి నిలబెట్టేందుకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి ఎంపిక చేసింది. గెలుపోట ములతో నిమిత్తం లేకుండా ఈ పోటీని సైద్ధాంతిక పోరుగా మార్చేందుకు, తమ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తమ నిర్ణయం దోహదపడుతుందని ఆ కూటమి నేతలు భావిస్తున్నట్లు- కనపడుతోంది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గతంలో నిజాయితీతో నడిచిన న్యాయకోవిదుడు. సుదర్శన్‌రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న నాలుగున్నరేళ్ల కాలంలో అప్పటి యూపీఏ ప్రభుత్వ నిర్ణయాలు చాలా వాటిని తప్పుపట్టారు. సహజవాయువు ప్రజలకు చెందుతుంది. దాన్ని వెలికితీసే కాంట్రాక్టర్ రిలయన్స్ కావచ్చు కాని దాని ధర ప్రభుత్వం నిర్ణయించాల్సిందేనని విస్పష్టంగా తీర్పు చెప్పిన బెంచ్‌లో ఆయన ఉన్నారు. విదేశీ బ్యాంకుల్లో దాచుకున్న నల్లధనాన్ని తిరిగి రప్పించడంలో విఫలమైన ప్రభుత్వాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆర్థిక నేరస్థులపై ప్రభుత్వం మెతకగా వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. వారిపై దర్యాప్తు చేసేందుకు సిట్‌ను నియమించాలని ఆదేశించారు. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లను ఆదివాసీలతోనే తుదముట్టించేందుకు ఏర్పర్చిన సల్వాజుడుంను రాజ్యాంగ వ్యతిరేకమని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సంచలన తీర్పు ఇచ్చారు. సామాన్యులను, ముఖ్యంగా చదువు రాని అమాయక ఆదివాసీ యువతను

## ఆన్‌లైన్ గేమింగ్ నిషేధం తగదు

న్యూఢిల్లీ, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ఆగడాలు ఇటీవల మరీ పెరిగిపోయాయి. దీన్ని అరికట్టడంలో భాగంగా 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధమైంది. ఈ బిల్లుకు కేబినేట్ తాజాగా ఆమోదం తెలిపింది. అయితే ఈ బిల్లుపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాసింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను అరికట్టేందుకు కేంద్రం తీసుకొచ్చే బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఏఐజీఎఫ్ ఆందోళన వ్యక్తంచేసింది. ఇది అమల్లోకి వస్తే తమ పరిశ్రమకు భారీ నష్టం జరుగుతుందని, కోట్లమంది చట్టబద్ధమైన గేమర్‌లు అక్రమంగా నెట్‌వర్క్‌లను నడిపేవారి వైపు వెళ్లేలా చేస్తుందని ఆవేదన వ్యక్తంచేసింది. అంతేకాక.. ఈ రంగంలోని అనేకమంది ఉద్యోగులపై కూడా దీని ప్రభావం ఉంటుందని హెచ్చరించింది. ఈసందర్భం గా దీన్ని పూర్తిగా నిషేధం విధించేకంటే.. దానిపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. ఆటగాళ్లను రక్షించడంతో పాటు- వారు బాధ్యతాయుతంగా ఆడేలా చర్యలు తీసుకోవాలని కోరింది. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలని, పరిశ్రమను పూర్తిగా చీకట్లోకి నెట్టేయొద్దని అభ్యర్థించింది. ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ వాడకం ఇటీ-వల విపరీతంగా పెరిగిపోయింది. దీనికి బానిసైన కొందరు అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటు-న్నారు. వీటిని ప్రమోట్ చేసిన ప్రముఖులు ప్రస్తుతం దర్యాప్తు సంస్థల నుంచి విచారణ ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌ను నేరంగా పరిగణిస్తూ.. 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకువచ్చేందుకు కేంద్రం సిద్ధమైంది. మంగళవారం ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోదం లభించిందని అధికార వర్గాలు తెలిపాయి. దీన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. దీంతో ఇక ఆన్‌లైన్ జూదానికి తెరపడనుంది.

## సమాజహితం కోసం పరితపించిన రతన్ టాటా

అమరావతి, రతన్ టాటా భరత జాతి ముద్దుబిడ్డ అని, దేశం కోసం తపించిన మహానుభావుడని ఏపీ సీఎం చంద్రబాబు కొనియాడారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కలసి ప్రారంభించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ..'దేశానికి ఏదైనా చేయాలని రతన్‌టాటా నిరంతరం తపించేవారని అన్నారు. సమాజసేవకు ఆయన జీవితాంతం కృషి చేశారు. ప్రతిఒక్కరూ డబ్బు సంపాదించాలనే చూస్తారు. ఆయన మాత్రం సంపాదించిన డబ్బును సమాజానికి తిరిగిచ్చేవారు. రతన్‌టాటా ఆలోచనలు సజీవంగా ఉంచాలని ఇన్నోవేషన్ హబ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఎంటప్రెన్యూర్ రావాలనేదే నా నినాదం. గతంలో ప్రతి ఇంటి నుంచి ఒక ఐటీ- ఉద్యోగి ఉండాలని కృషి చేశాను. భవిష్యత్ అంతా ఐటీ- రంగానిదే అని గుర్తించాను. ప్రభుత్వ సరైన విధానాలు అవలంబిస్తే ఆదాయం, సంపద వస్తుందని చంద్రబాబు అన్నారు. వినూత్న ఆలోచనలతో ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు పారదర్శకంగా ప్రోత్సాహకాలు కల్పించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కీలక వేదిక కానుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆలోచనలకు తగ్గ ఫలితాల సాధనే లక్ష్యంగా ఈ వేదిక పని చేస్తుందన్నారు. ఇందుకనుగుణంగా విద్యా వ్యవస్థ పునాదులు బలోపేతం చేసి విద్యార్థి దశ నుంచే ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. ముందున్న సవాళ్లకు తగ్గట్టుగానే అవకాశాలను అందిపుచ్చుకునే కార్యాచరణతో పనిచేస్తున్నట్లు చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్రంలో పని చేస్తున్నందున దేశానికి ఏపీ ఆవిష్కరణల హబ్‌గా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. వ్యాపారం అంటే లాభాలు మాత్రమే కాదని.., విలువలు, మానవత్వంతో కూడిన పని అని చాటిన మహనీయుడు రతన్ టాటా అని కొనియాడారు. అలాంటి మహోన్నత వ్యక్తికి ఈ వినూత్న ఆవిష్కరణల వేదికను అంకిత మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆవిష్కరణలు, స్టార్టప్, నైపుణ్య అభివృద్ధి, ఉపాధిని ప్రోత్సహించాలనే టార్గెట్ తో రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా సిలికాన్‌వ్యాలీ తరహా ఎకోసిస్టమ్‌ను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో అమరావతిలో రాష్ట్ర సర్కార్ పూర్తి సహకారంతో తొలి హబ్‌ను ఏర్పాటు-చేసినట్లు- ఆ సంస్థ వెల్లడించింది. దీని ద్వారా స్థానిక పెట్టుబడిదారులకు ప్రత్యేక గుర్తింపుతో పాటు యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. అలాగే, యువతను ఉద్యోగాల కోసం ఎదురు చూసే పరిస్థితి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగేలా చేస్తామని రతన్‌టాటా సంస్థ వెల్లడించింది. వనరుల కల్పన, నెట్‌వర్క్ ఛాన్స్, ప్రోగ్రాం రూపకల్పనకు ఈ ఇన్నోవేషన్ హబ్స్ ఉపయోగపడతాయని పేర్కొంది.

### గిన్నిస్‌రికార్డుల్లో ఆవిష్కరణ ఆంధ్ర

అమరావతి, ఏపీలో నిర్వహించిన 'ఆవిష్కరణ ఆంధ్ర' కార్యక్రమం గిన్నిస్ రికార్డు సృష్టించింది. ఆన్‌లైన్‌లో 24 గంటల్లో అత్యధిక మంది పారిశ్రామికవేత్తలు పేర్లు నమోదు చేసుకున్నారు. 1.67 లక్షల మంది దరఖాస్తు చేసుకోవడంతో ప్రపంచ రికార్డు లభించింది. రికార్డు సర్టిఫికేట్‌ను గిన్నిస్ బుక్ ప్రతినిధులు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు అందించారు. ఆవిష్కరణ ఆంధ్రపై నేతలు, పారిశ్రామికవేత్తలు ప్రతిజ్ఞ చేశారు. ప్రతీ కుటు-ంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారుచేసే దిశగా కృషి చేస్తామని చంద్రబాబు, లోకేశ్, పారిశ్రామికవేత్తలు ప్రతిజ్ఞ చేశారు.

### భారీ వర్షాలతో చెరువుకలు జలకళ

కామారెడ్డి, ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కామారెడ్డి జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు నిండుకుండలా మారాయి. జిల్లాలోని 414 చెరువులు అలుగు పారుతున్నాయి. 15 రోజుల కిందటివరకు జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువుల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో నీటి నిల్వలు లేవు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో జలాశయాల్లోకి భారీగా నీళ్లు చేరాయి. ఎగువన ఉన్న సింగూర్, పోచారం ప్రాజెక్టుల నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 3 రోజులుగా భారీగా వరద వస్తోంది. నిజాంసాగర్ లో దాదాపు పూర్తిస్థాయిలో నీరు చేరింది. నిజాంసాగర్ ఫుల్ కెపాసిటీ- 17.8 టీ-ఎంసీలుకాగా ప్రస్తుతం 15.943 టీఎంసీల నీరు ఉంది. మంగళవారం సాయంత్రం వరకు ఇన్ ఫ్లో 80వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. మంగళవారం 16 గేట్లు- ఎత్తి 85 వేల క్యూసెక్కుల నీటిని మంజీరానదిలోకి వదిలారు. కౌలాస్ నాలా ప్రాజెక్టు కెపాసిటీ- 1.237 టీ-ఎంసీలకు గాను ప్రస్తుతం 1.164 టీ-ఎంసీల నీరు నిల్వ ఉంది. 5 గేట్లు- ఎత్తి వరద నీటిని బయటకు వదిలారు. కళ్యాణి ప్రాజెక్ట్ లో పూర్తి నీటిమట్టం 409 మీటర్లు కాగా 408 మీటర్ల వరకు నీరుంది. సింగీతం రిజర్వాయర్ పూర్తిగా నిండింది. దీని పూర్తి మట్టం 416 మీటర్లు కాగా 416 మీటర్ల వరకు నీరు నిల్వ ఉంది. పోచారం, కళ్యాణి, కౌలాస్ సింగీతం రిజర్వాయర్ లు నిండాయి. వానకాలం, యాసంగి పంటలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందనుంది. జిల్లాలో మొత్తం 1,515 చెరువులు ఉండగా దాదాపు సగం చెరువులు నిండాయి. 173 చెరువుల్లో 25 శాతం వరకు నీరుండగా, 262 చెరువులు 25 నుంచి 50 శాతం వరకు

# కవితకు ఊహించని షాకిచ్చిన కేసీఆర్.. ఆ పదవి నుంచి ఔట్!




హైదరాబాద్,కల్వకుంట్ల కవిత అమెరికా పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ అనుబంధ సింగరేణి కార్మిక సంఘంలో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇన్నాళ్లు ఆ యూనియన్ గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న కవితను కాదని సంఘం గౌరవ అధ్యక్షుడిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ రోజు హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో జరిగిన టీబీజీకేఎస్ కార్యవర్గ సమావేశంలో కొప్పుల ఈశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యకలాపాలను పార్టీ తరఫున ముందుకు తీసుకెళ్లేందుకు భారత రాష్ట్ర సమితి నిర్ణయం తీసుకుంది. కాగా ఇటీవల బీఆర్ఎస్ పార్టీలో జరగిన కొన్ని పరిణామాల నేపథ్యంలో యూనియన్ గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న కవితను తప్పించి కొప్పుల ఈశ్వర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆం ప్రకటించారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేకపోయిన కవిత సింగరేణిలో జాతీయ సంఘంగా ఉన్న హెచ్ఎంఎస్‌తో చేతులు కలిపింది. ఇప్పటి నుంచి తెలంగాణ జాగృతి, హెచ్ఎంఎస్ కలిసి పనిచేస్తాయని ప్రకటించింది. అయితే రెండు రోజుల క్రితం కవిత తన కుమారుని విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్లింది. ఈ తరుణంలోనే ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. సింగరేణిలో తెలంగాణ వాదాన్ని వినిపించాలన్న లక్ష్యంతో 2003లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చేతుల మీదుగా ఆవిర్భవించింది. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించింది. ఆ తర్వాత 2012, 2017లో రెండుసార్లు సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘంగా ఎన్నికైంది. దాదాపు పదేళ్లపాటు గనుల్లో హవా కొనసాగించింది. అయితే ఆ తర్వాత వచ్చిన యూనియన్ అంతర్గత కుమ్ములాటలతో సింగరేణిలో ఆ సంఘం బలహీనపడుతూ వచ్చింది. ఇక ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెందగా, అనంతరం సింగరేణి ఎన్నికల్లో కూడా ఓటమి తప్పదని పోటీ చేయడం లేదని ప్రకటించింది. అయితే నామమాత్రంగా పోటీలో ఉన్నప్పటికీ టీబీజీకేఎస్ ఓటమి చవిచూసింది. ఆ తర్వాత సంఘం గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట కవిత ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్ట్ అయ్యారు. ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఓటమి పాలవ్వడంతో బీఆర్ఎస్ లో నైరాశ్యం నెలకొంది. అయితే తిరిగి పార్టీ బలోపేతం తో పాటు అనుబంధ సంఘాలను బలోపేతం చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో తిరిగి టీబీజీకెఎస్‌కు పూర్వ వైభవం తీసుకు రావాలని బీఆర్ఎస్ భావిస్తోంది. అందులో భాగంగా తెలంగాణ భవన్ లో బుధవారం జరిగిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర కార్యవర్గ సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కేంద్ర కార్యవర్గ గౌరవ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఇక మీదట తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులుగా, సంఘం వ్యవస్థాపక సభ్యులు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వ్యవహరిస్తారని, ఆయన ఆధ్వర్యంలో కార్మిక సంఘం కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లాలని, అలాగే సింగరేణి సమస్యలపై పెద్దఎత్తున పోరాటాలు చేపట్టాలని నిర్ణయించడం జరిగిందని యూనియన్ నాయకులు తెలిపారు. సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేదాకా ప్రభుత్వంపై ప్రజాక్షేత్రంతో పాటు, ఇతర రూపాల్లో ఒత్తిడి తీసుకురావాలని, పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి కార్మికుల కొరకు, సింగరేణి సంస్థ కొరకు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా కార్మికుల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు సూచించినట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు అడ్డగోలుగా అమలు చేయడానికి వీలుకాని హామీలు ఇచ్చిన తీరుగానే, సింగరేణికి కూడా మోసం చేసిందని, ఈ అంశాలను కార్మికుల దృష్టికి తీసుకువెళ్లాలని సమావేశంలో నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు.

# రేవంత్ స్వచ్ఛమైన అభ్యర్థనకు స్పందన ఎంత?




హైదరాబాద్,దేశ రెండో అత్యున్నత పదవి ఉపరాష్ట్రపతి ఎన్నిక తెలుగు రాష్ట్రాల రాజకీయ పార్టీలకు సంకటంగా మారిందని చెప్పక తప్పదు. ఎందుకంటేఓ వైపు కేంద్రంలో అధికార ఎన్డీఏతో ఏపీలోని కీలక పార్టీలు పొత్తులో ఉన్నాయి. తెలంగాణ రాజకీయ పార్టీలు కాంగ్రెస్ అంటే వ్యతిరేకతతో ఏ నిర్ణయం తీసుకుంటాయో తెలియదు. ఇలాంటి సమయంలో తెలంగాణ సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి తెలుగు రాష్ట్రాల రాజకీయ పార్టీలకు ఓ స్వచ్ఛమైన, క్లియర్ కట్ అభ్యర్థన చేశారు. మరి ఈ అభ్యర్థనకు ఏ మేర సానుకూలత వ్యక్తమవుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఉపరాష్ట్రపతి ఎన్నికలో అధికార ఎన్డీఏ అభ్యర్థిగా తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్ ఎంపికయ్యారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి తన అభ్యర్థిగా తెలంగాణకు చెందిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని ఎంపిక చేసింది. సుదర్శన్ రెడ్డి తెలంగాణకు చెందిన వారు కావడంతో ఆయనను గెలిపించుకునే బాధ్యత రేవంత్ పై ఓ మోస్తరు ఎక్కువగానే పడిందని చెప్పాలి. ఇతర రాష్ట్రాల పరిస్థితి ఎలా ఉన్నా%ౌ% కనీసం తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయ పార్టీల నుంచి సుదర్శన్ రెడ్డికి మెజారిటీ ఓట్లు వేయించడమే లక్ష్యంగా రేవంత్ సాగుతున్నారు. అందులో భాగంగా మంగళవారం ఆయన తెలుగు రాష్ట్రాలకు చెందిన అన్ని రాజకీయ పార్టీలకు ఓ అభ్యర్థన చేశారు. రేవంత్ చేసిన అభ్యర్థన చూస్తుంటే%ౌ% మన తెలుగోడిని మనం కాకుంటే ఇంకెవరు గెలిపిస్తారు? మనమే గెలిపించుకోవాలి కదా అన్న భావన వ్యక్తమైంది. ఈ సందర్భంగా టీడీపీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు, ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఏపీలో విపక్ష నేత, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిల పేర్లను ప్రస్తావిస్తూ మన తెలుగు నేలకు చెందిన సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. అదే సమయంలో తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీల పేర్లతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన బీజేపీ ప్రజా ప్రతినిధులు కూడా సుదర్శన్ రెడ్డికే మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. రేవంత్ అభ్యర్థన బాగానే ఉంది గానీ%ౌ% ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ గానీ, జనసేన గానీ రాధాకృష్ణన్ కే మద్దతు పలికాయి. ఇక కేసుల భయమో, రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అడిగారనో తెలియదు గానీ.. ఇప్పటికే వైసీపీ కూడా ఎన్డీఏ అభ్యర్తికే మద్దతు తెలిపింది. ఈ లెక్కన ఏపీ నుంచి సుదర్శన్ రెడ్డికి ఓట్లు పడే ఛాన్సే లేదు. ఇక తెలంగాణ విషయానికి వస్తే%ౌ% కాంగ్రెస్ తో పాటు బీజేపీతోనూ సమదూరం పాటిస్తున్న బీఆర్ఎస్%ౌ% ప్రాంతీయత ఆధారంగా అడుగు ముందుకేస్తే%ౌ% ఆ పార్టీ ఓట్లు సుదర్శన్ రెడ్డికి పడినట్టే. మజ్లిస్ ఓట్లు మాత్రం తప్పనిసరిగా సుదర్శన్ రెడ్డికే పడతాయని చెప్పొచ్చు. ఇక తెలంగాణలోని బీజేపీ నేతల ఓట్లు సుదర్శన్ రెడ్డికి దక్కే అవకాశాలు అంతంతమాత్రమే. మొత్తంగా రేవంత్ అభ్యర్థనకు అంతంతమాత్రం స్పందన మాత్రమే లభించనుందని చెప్పక తప్పదు.

# కేటీఆర్ వాదన : సుదర్శన్ రెడ్డి బీసీ కాదు !



హైదరాబాద్,ఉపరాష్ట్రపతి ఎన్నికలో బీఆర్ఎస్ తెలంగాణకు చెందిన సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇస్తుందా లేదా అన్నదానిపై ఉన్న ఉత్కంఠను కేటీఆర్ తోసిపుచ్చేశారు. ఆయన తెలంగాణకు చెందిన న్యాయకోవిదుడు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అయినప్పటికీ.. ఆ గుర్తింపు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. సుదర్శన్ రెడ్డికి బదులుగా బీసీ అభ్యర్థికి అవకాశం ఇవ్వాల్సిందని ఆయన చెప్పుకొచ్చారు. కంచె ఐలయ్యను ఉపరాష్ట్రపతి అభ్యర్తిగా నిలబెట్టి ఉండాల్సిందన్నారు. సుదర్శన్ రెడ్డిని కేటీఆర్ వెటకారం చేస్తున్నారని సులువుగానే అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసమే అని చెప్పే బీఆర్ఎస్ ఇప్పుడు తెలంగాణ నుంచి ఇండి కూటమి కూటమి అభ్యర్థిగా సుదర్శన్ రెడ్డి నిలబడితే.. మద్దతిచ్చేందుకు ఏ మాత్రం సుముఖంగా లేరు. ఆయన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాదని.. ఆయనకు కాంగ్రెస్ తో సంబంధం లేదని రేవంత్ చెబుతున్నారు. హైకమాండ్ ఆదేశిస్తే సుదర్శన్ రెడ్డికి మద్దతు కోసం కేసీఆర్ ను కలుస్తానని కూడా ప్రకటించారు. అయితే బీజేపీని వ్యతిరేకించే మూడ్‌లో ఇప్పుడు బీఆర్ఎస్ లేదు. తెలంగాణకు చెందిన వ్యక్తి ఉన్నత స్థానానికి పోటీ పడుతున్న తమ తెలంగాణ నినాదానికి భగ్నం కలుగుతున్నా.. ప్రజలు ఏదో అనుకుంటారని.. తెలంగాణ వాదం అనేది రాజకీయ లాభం కోసమే వాడుతున్నారని విమర్శలు వస్తాయని తెలిసినా.. బీఆర్ఎస్‌కు మరో మార్గం లేదు. బీజేపీ అభ్యర్థికి మద్దతివ్వడం లేదా.. ఓటింగ్ ను బహిష్కరించడం. ఏది చేసినా బీజేపీకే లాభం.

# అమరావతి మునిగిపోతుంటే.. జగన్ ఎందుకు పర్యటించరు?

అమరావతి,ఆరోపణలు చేసి చేతులు దులిపేసుకోవడమే తప్ప.. ఆ ఆరోపణలకు రుజువులు చూపించాలన్న బాధ్యతను మాత్రం ఇసుమంతైనా పట్టించుకోరు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ . ఇక అమరావతి విషయంలో అయితే ఆయన వెళ్లగక్కే విద్వేషానికి, చేసే విమర్శలు, ఆరోపణలకు అంతే ఉండదు. ఐదేళ్లు అధికారంలో ఉన్న జగన్ ఆంధ్రప్రదేశ్ ను రాజధాని లేని అనాథ రాష్ట్రంలా మార్చారు. మూడు రాజధానులంటూ కనీసం ఒక్క ఇటుక కూడా పేర్చకుండా.. విశాఖలో రుషికొండకు బోడిగుండు కొట్టి మరీ ప్యాలెస్ నిర్మిచారు. 151 స్థానాలతో అధికారం చేజిక్కించుకున్న వైసీపీ ఐదేళ్లు గిర్రున తిరిగే సరికి 11 స్థానాలతో కనీసం ప్రతిపక్ష హోదాకి కూడా నోచుకోని విధంగా దిగజారిపోవడానికి అధికారంలో ఉండగా అనుసరించిన ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలే కారణమనడంలో ఎటువంటి సందేహం లేదు. నాడు అంటే 2014-19 మధ్య కాలంలో అమరావతికి జై కొట్టిన జగన్.. అధికారంలో ఉన్న ఐదేళ్లూ అమరావతిని నిర్వీర్యం చేయడానికి చేయగలిగినంతా చేశారు. అమరావతి రాజధానికి భూములిచ్చిన రైతులను వేధించారు. వారిపై అక్రమ కేసులు బనాయించారు. ఇక అప్పటి ప్రతిపక్ష నేతపై అవమానకర వ్యాఖ్యలు చేయించారు. అక్రమ కేసులో 52 రోజుల పాటు జైలుకు పంపారు. సరే ఇవన్నీ పంటి బిగువున భరించి ఆగ్రహాన్ని పెదవి బిగింపులో దాచుకుని ఎన్నికల వేళ ప్రజలు తన సత్తా చాటి జగన్ కు ఘోరాతి ఘోరమైన పరాభవాన్ని, పరాజయాన్ని రిటర్న్ గిఫ్ట్ గా ఇచ్చారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజధాని నిర్మాణం జోరందుకుంది. అయితే జగన్, ఆయన పార్టీ నేతలూ మాత్రం అమరావతిపై విషం కక్కడం మానలేదు. తాజా వర్షాలకు అమరావతి మునిగిపోయిందంటూ పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభించారు. ఫేక్ వీడియోలతో సోంత మీడియా, సోషల్ మీడియాలో ఊదరగొట్టేస్తున్నారు. ఇక్కడే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాబాహుల్యంలో ఓ సందేహం వ్యక్తం అవుతున్నది. నిజంగానే అమరావతి మునిగిపోతుంటే.. అక్కడి ప్రజలకు అండగా నిలబడి పోరాడేందుకు తాడేపల్లి ప్యాలెస్ గేటు దాటి జగన్ ఎందుకు పర్యటించడం లేదు అన్నదే ఆ సందేహం. జగన్ అమరావతిలో ముంపునకు గురైన ప్రాంతాలు నిజంగా ఉంటే.. ఆయా ప్రాంతాలలో పర్యటించవచ్చు కదా.. గతంలో బుడమేరు వరద ముంపులో బెజవాడ చిక్కుకున్నప్పుడు పర్యటించారు కదా? ఇప్పుడు ఆయనకు అడ్డుపడుతున్నదేమిటి? అడ్డుకుంటున్నదెవరు? ఇక్కడే జగన్ తీరు, అమరావతిపై వైసీపీ చేస్తున్న విమర్శలు నమ్మశక్యంగా లేవని జనం అంటున్నారు. పరిశీలకులు కూడా అమరావతి ముంపు అంటూ వైసీపీయులు చేస్తున్న రాద్ధాంతం అసత్య ప్రచార మేనని విశ్లేషిస్తున్నారు. నిజంగా అమరావతిలో ముంపు ప్రాంతాలు ఉన్నట్లైతే.. జగన్ కచ్చితంగా పర్యటించేవారనీ, కానీ ఇప్పుడు పర్యటిస్తే అమరావతిలో వరద ముంపు కాకుండా, నిటారుగా నిలబడిన నిర్మాణాలు కనిపిస్తాయనీ తెలుసుకనుకనే ఫేక్ ప్రచారాలను నమ్ముకుని జనంలో కన్ఫ్యూజన్ క్రియేట్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని అంటున్నారు.

# హైదరాబాద్ లో మళ్లీ రియల్ భూమ్

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం మరోసారి వార్తల్లో నిలిచింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (%ఎవీణూ%) కీలక ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించడానికి సిద్ధమైంది. ఇప్పటికే తుర్కయాంజాల్, బాచుపల్లి వంటి ప్రాంతాల్లోని ప్లాట్ల కోసం నోటిఫికేషన్లు జారీ చేసి, సెప్టెంబర్ 16 నుండి 18 వరకు తొలి విడత వేలం నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. ఈసారి వేలంలో ప్రత్యేకించి కోకాపేటలోని భూములు హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో ఒక ఎకరం భూమి రూ.100 కోట్లకు పైగా అమ్ముడుపోయిన రికార్డును ఈసారి తిరగరాస్తుందా అన్నది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తి రేపుతోంది.

-తొలి విడతలో 82 ప్లాట్లు

మొదటి దశలో మొత్తం 82 ప్లాట్లు వేలానికి రానున్నాయి. ఇందులో తుర్కయాంజాల్ లేఅవుట్‌లో 12 ప్లాట్లు, బాచుపల్లి లేఅవుట్‌లో 70 ప్లాట్లు ఉన్నాయి. అలాగే రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని మరికొన్ని ప్లాట్లను కూడా %ఎవీణూ% విక్రయించనుంది. తర్వాతి దశల్లో బైరామల్‌గూడ, పుప్పాలగూడ, చందానగర్, చెంగిచెర్ల, సూరారం, బౌరంపేట్ వంటి కీలకమైన ప్రాంతాల భూములను వేలం వేయనున్నారు.

- కోకాపేట నియోపోలిస్: మళ్ళీ అదే హాట్ డిమాండ్

గతంలో కోకాపేట నియోపోలిస్‌లో జరిగిన భూముల వేలం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఒక చదరపు గజం ధర రూ.1 లక్ష వరకు పలకగా, ఒక ఎకరం భూమి ఏకంగా రూ.100 కోట్లకు పైగా అమ్ముడుపోయింది. ఈసారి కూడా కోకాపేటలోని సర్వే నంబర్ 144లో ఉన్న 8,591 గజాలు, సర్వే నంబర్ 146లో ఉన్న 1,400 గజాల భూములకు పెట్టుబడిదారుల నుండి భారీ డిమాండ్ ఉన్నట్లు సమాచారం. ఈ ప్రాంతంలో ఇప్పటికే అనేక ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందడంతో ధరలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

-బేస్ ప్రైస్, అంచనాలు

మొదటి విడత వేలం కోసం ఒక చదరపు గజానికి రూ.30,000 నుండి



రూ.35,000 వరకు బేస్ ప్రైస్ ఉండొచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే కోకాపేట, పుప్పాలగూడ వంటి ప్రధాన ప్రాంతాల్లో ధరలు ఈ బేస్ ప్రైస్ కన్నా అనేక రెట్లు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా కార్నర్ ప్లాట్లకు ఎక్కువ పోటీ ఉంటుందని, బిడ్డర్లు భారీగా ధరలు పెంచే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ నిపుణులు అంటున్నారు.

-పెట్టుబడిదారులకు స్వర్ణావకాశం

ప్రస్తుతం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం పుంజుకున్న నేపథ్యంలో ఈ వేలం పెట్టుబడిదారులకు ఒక మంచి అవకాశంగా నిపుణులు సూచిస్తున్నారు. ఐటీ కారిడార్ విస్తరణ, మెట్రో కనెక్టివిటీ, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాల కల్పన వంటి కారణాల వల్ల కోకాపేట, పుప్పాలగూడ, బాచుపల్లి లాంటి ప్రాంతాలు భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఈ వేలం పాటలు పూర్తిగా ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు %ఎవీణూ% అధికారులు తెలిపారు, ఇది పారదర్శకతను పెంచుతుంది. మొత్తంగా ఈసారి కోకాపేట భూముల వేలం గత రికార్డును తిరగరాస్తుందా లేదా అనేది ఇప్పుడు రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వేలం ఫలితాల కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రాష్ట్ర ప్రభుత్వాలపై కుట్రలకే ఆ బిల్లు !?



న్యూఢిల్లీ,ప్రధానమంత్రి అయినా, ముఖ్యమంత్రి అయినా ఇతర మంత్రులు అయినా అరెస్టు అయిన 30 రోజుల తర్వాత అంటే 31వ రోజున ఆటోమేటిక్ గా పదవి పోతుంది. అరెస్టు అయిన కేసు ఐదేళ్లు శిక్షపడే సెక్షన్ల కింద నమోదు అయితే చాలు. ఈ మేరకు చట్టాన్ని పార్లమెంట్ లో కేంద్రం ప్రవేశపెడుతోంది. ఇదేదో ప్రధానమంత్రిని కూడా చట్టపరిధిలోకి తెస్తున్న గొప్ప చట్టం అనుకుంటారు కానీ.. తమకు నచ్చని ప్రభుత్వాలు ఉన్న చోట్ల కుట్రలు చేయడానికి ఉపయోగపడే చట్టం అని .. ఇప్పటి వరకూ జరిగిన రాజకీయ పరిణామాలను అర్థం చేసుకున్న వారికి తెలిసి వస్తుంది.

కేంద్రం మంత్రులపై కేసులు పెట్టే ధైర్యం పోలీసులకు ఉంటుందా ?

కేంద్ర మంత్రులపై కేసులు పెట్టేంత బలమైన దర్యాప్తు సంస్థలు, పోలీసు వ్యవస్థ మనకు లేదు. పాలకుల కనుసన్నల్లోనే నడిచిపోయే వ్యవస్థలే ఉన్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థలు అత్యంత పవర్ ఫుల్. అలాగే ఢిల్లీలో శాంతిభద్రతలు కూడా కేంద్రం దగ్గరే ఉంటాయి. ఈ సంస్థలు ఏవీ కేంద్ర మంత్రివర్గంలోని వారిపై ఈగ వాలనివ్వవు. ఎంత నేరం చేసినా పట్టించుకోరు. కానీ.. మంత్రిగా ఉండి.. కేంద్రంలోని పెద్దల్ని ధిక్కరిస్తే మాత్రం వెంటనే అరెస్టులు జరిగిపోతాయి. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ గా పని చేసిన సత్యపాల్ మాలిక్ ఉదంతమే దానికి ఉదాహరణ. ఆయన బీజేపీ పెద్దలతో విబేధించిన తర్వాత ఆయనపై కేసులు నమోదయ్యాయి. అయితే ఆయన ఇప్పుడు చనిపోయారు.

ఇష్టం లేని ప్రభుత్వాధినేతలపై గురి పెట్టడానికే !

బీజేపీ పాలనలో ఇప్పటి వరకూ అధికారంలో ఉన్న ఇద్దరు ముఖ్యమంత్రుల్ని అరెస్టు అయ్యారు. జార?ండ్ సీఎం హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేసింది. అయితే ఆయన రాజీనామా చేశారు. జైలు నుంచి బయటకు వచ్చాక మళ్లీ పదవి చేపట్టారు. కానీ కేజ్రీవాల్ అలా చేయలేదు. లిక్కర్ స్కాంలో అరెస్టు అయిన తర్వాత ఆయన జైలులో కూడా సీఎంగానే ఉన్నారు. ఆయన రాజీనామా చేయాలన్న నిబంధనలు లేవు. అలాగే మంత్రులు కూడా. అందుకే ఏమీ చేయలేకపోయారు. ఇలా మరోసారి జరగకూడదని.. దర్యాప్తు సంస్థలతో సీఎంలను అరెస్టు చేయిస్తే వారు రాజీనామా చేయాల్సిందేనని లేకపోతే 31వ రోజుకు పదవిపోయేలా చట్టం తెస్తున్నారు. రాష్ట్రంలోని దర్యాప్తు సంస్థలు ఆ ప్రభుత్వాల చేతుల్లోనే ఉంటాయి. వాళ్ల పరిధి ఆ రాష్ట్రం వరకే. అందుకే కేంద్ర పెద్దలపై చర్యలు తీసుకోలేరు. ముఖ్యమంత్రులపై కేంద్ర దర్యాప్తు సంస్థలు కేసులు పెట్టి అరెస్టు చేయగలవు.

దుర్వినియోగం కోసమే పట్టాలా ?

బీజేపీ కేవలం దుర్వినియోగం చేయడానికే ఇలాంటి చట్టాలు చేస్తోందన్న ఆరోపణలు బలంగా వస్తున్నాయి. ఇప్పటికే పార్టీ ఫిరాయింపుల నిరోధకచట్టం.. కేవలం స్పీకర్ కు కాలపరిమితి లేకపోవడం వల్లనే నిర్వీర్యం అవుతోంది. అధికార పార్టీల చేతిలో వంచనకు గురవుతుంది. ఈ చట్టం మార్చాలని.. స్పీకర్ కు అయినా ఓ టైమ్ ఫ్రేమ్ పెట్టాలని స్వయంగా సుప్రీంకోర్టు సూచించినా పట్టించుకోవడంలేదు కానీ ఇలాంటి అర్థం, పర్థం లేని చట్టాలను తీసుకు రావడానికి మాత్రం వెనుకాడటం లేదు. బిల్లు పెట్టిన వెంటనే పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపుతారు. చట్టంగా మార్చే ముందు విస్తృత చర్చ జరిగేలా విపక్షాలే చూసుకోవాల్సి ఉంది.

## పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఖమ్మం,వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిడకంటి చిన వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు రెవెన్యూలో నర్సింహాపురంలో నీట మునిగిన పత్తి చేలను ఆయన రైతులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూరల్ మండలంలో వర్షాల కారణంగా నల్లరేగడి నేలలు ఊట పెట్టి నీరు నిలిచాయన్నారు. రైతులు సాగు చేసిన పెసర, మొక్కజొన్న, పత్తి , మిరప పంటలకు నష్టం వాటిల్లిందన్నారు.

# ఉస్మాన్ సాగర్ రెండు గేట్లు ఎత్తివేత



మణికొండ,: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో జంట జలాశయాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉస్మాన్‌సాగర్ రెండు గేట్లు ఒక ఫీట్ మేర ఎత్తి మూసీలోకి నీటిని వదదిలారు. గండిపేట జలాశయం ఎఫ్‌టిఎల్ మొత్తం 1790 ఫీట్లు కాగా ప్రస్తుతం నీటి మట్టం 1789 ఫీట్లకు చేరుకుంది. వెంటనే స్పందించిన అధికారులు గేట్లను ఎత్తి నీటిని మూసీలోకి వదిలారు. కాగా హిమాయత్‌సాగర్ జలాశయం ముందస్తుగా నీటి మట్టానికి చేరుకోవడంతో గత కొన్ని రోజులుగా గేట్లను ఎత్తి నీటిని ఈసీ నదిలోకి వదులుతున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే ఈ సంవత్సరంలో మొదటిసారిగా ఉస్మాన్‌సాగర్ గేట్లు బుధవారం ఎత్తి మూసీలోకి 1600 క్యూసెక్కుల నీటిని వదిలారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com